## మహాకాలుని ప్రేరణ - అతి ముఖ్య సూచన

క్రాంతి ధర్మీ సాహిత్యము అనే పేరుతో ప్రసిద్ధి గాంచిన ఈ పుస్తకమాల క్రాంతిదర్శీ ప్రజ్ఞాపురుషుడు పండిత శ్రీరామశర్మఆచార్య గారిద్వారా 1989 నుండి1990 మధ్య కాలములో తమ మహాప్రయాణమునకు ఒక సంవత్సరము ముందు ఒక ప్రవాహముగా సృజించబడినవి. ఇరవై చిన్న చిన్న పుస్తకములుగా వున్న ఈ సాహిత్యము గురించి మన ఆరాధ్య పరమపూజ్య గురుదేవులు (పండిత శ్రీరామశర్మఆచార్యగారు) ఇలా వివరించారు - “ ఇవి నా విచారక్రాంతి యొక్క బీజములు. ఇవి కొద్దిగా అయినా సరే విస్తరింపబడితే మనుష్యులును కుదిపివేస్తాయి. సంపూర్ణ విశ్వము యొక్క పటము (MAP) నే మార్చివేస్తాయి”. నిజానికి ఈ పుస్తకములలో కేవలము ఆలోచనలే కాదు ఒక మహాక్రాంతి యొక్క జ్వాల లేక మంట వున్నది. యుగపరివర్తన దిశ నిర్ధారింపబడింది.

యుగఋషి తమ జీవితమంతా, జీవించే కళ నుండి నిగూఢ ఆధ్యాత్మిక విషయములు మరియు సమాజనిర్మాణము నుండి వైజ్ఞానిక-ఆధ్యాత్మిక ప్రధానమైన సమగ్ర సాహిత్యము ఏదయితే  రాస్తూ వచ్చారో దానిని మొత్తము త్రాసులో ఒక తక్కెడలో పెట్టి రెండవ వైపు సూత్రప్రాయముగా వ్రాయబడిన ఈ పుస్తకములను పెడితే వీని బరువే ఎక్కువ. ఈ అమూల్య సాహిత్యాన్ని ఎవరైనా లాభమువద్దు, నష్టమువద్దు (NO PROFIT-NO LOSS) పద్ధతిన అచ్చుగుద్ది వ్యక్తివ్యక్తికీ అందచేయమనే నిర్దేశము గాయత్రీపరివార్ యొక్క అధిష్ఠాత పరమపూజ్య గురుదేవులు స్వయముగా ఇచ్చారు. వీటిని ఎవరైనా ప్రచురణ చేయవచ్చు, ఎవరికైనా పంచవచ్చు. వీటిని ఎంత ఎక్కువమంది వ్యక్తులకు ఏ పాఠకుడు, పరిజనుడు అందచేయగలడో అతను అంత ఎక్కువ పుణ్యాన్ని పొందగలడు.

*Global Head Quarters :* **GAYATRI TEERTH**
*Shanntikunj, Haridwar, Pin- 249411*
*Phones: (01334)2460866, 2461955, 2460309*
*Phones: (01334) 2460866 E-mail : shail@del2vsnl.net.in*
*website : www.gayatripariwar.org, www.awgp.org*

మహాపూర్ణాహుతి పుస్తకమాల - 8

# ప్రతిభా వంతులకు మహాకాలుని పిలుపు



పండిత శ్రీరామశర్మ ఆచార్య

## విచారక్రాంతి ఉద్యమం
సఫలమగుగాక ! సఫలమగుగాక ! సఫలమగుగాక !

మహాపూర్ణాహుతి పుస్తకమాల - 8

# ప్రతిభావంతులకు మహాకాలుని పిలుపు

హిందీ మూలరచన :

వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట

**పండిత శ్రీరామశర్మ ఆచార్య**

అనువాదము :

**శ్రీమతి కాటూరి తేజశ్రీ**


ముద్రణ

**గాయత్రి చేతనా కేంద్రము**

అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్,

హైదరాబాద్-500018.

ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888

E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

విషయసూచిక

1. సర్వోచ్చమైన లాభము - ప్రతిభ 1

2. ప్రతిభను మించిన సమర్థత లేనేలేదు 9

3. పరిష్కృతమైన ప్రతిభ -
ఒక దైవీ అనుదానము - వరదానము 17

4. ప్రచండమైన మనోబలము ప్రతిభగా
పరిణితి చెందుతుంది 26

5. ముందుకు నడవండి - లక్ష్యము చేరుకోండి 36

## భూమిక

వ్యక్తిత్వ పరిష్కారమే ప్రతిభా పరిష్కారము. ధాతువుల ఖనిజాలు ఎక్కడుంటాయో ఆ క్షేత్రముయొక్క ఆ ధాతుకణాలే మట్టిలో కూరుకుపోయి అదే దిశలో ముందుకు సాగుతూ గనులయొక్క అయస్కాంత ఆకర్షణలతో ఆకర్షితమై ఇంతకుముందు వెలువడిన ఖనిజాల భారమును, కళేవరాన్ని, గౌరవమును పెంపొందిస్తాయి. వ్యక్తిత్వము గలవారు అనేకుల స్నేహము, సహయోగము, సలహాలు మరియు ఉపయోగపడే సాన్నిధ్యాన్ని పొందుతారు. ఇది వ్యక్తిగత పురుషార్థము. ఇతర సుఖసాధనములు ఇతరుల దయతో పొందవచ్చును. కానీ ప్రతిభాపరిష్కారము కొరకు వ్యక్తిగత సంకల్పము, సమయము, పురుషార్థము ఉపయోగపడుతుంది. ఈ పౌరుషము చూపించుటలో ఎటువంటి లోటు రానివద్దని గీతాకారుడు విచారశీలురను

అనేక ప్రసంగములతో ప్రోత్సహించారు.

ఒకచోట మనిషి తనకు తానే శత్రువనీ, తనకు తానే మిత్రుడనీ చెప్పబడినది. అందువల్ల

**నిన్ను నీవు పైకి లేపుకో!**

**క్రింద పడబోకు!**

**యుగశక్తి గాయత్రి**

**వ్యక్తిత్వ నిర్మాణ మాసపత్రిక**

సం॥ చందా : రూ. 90/-లు    3 సం॥లకు : రూ 250/-లు

10సం॥లకు : రూ. 750/-లు    ఆజీవన చందా: రూ. 1800/-లు

పూర్తి వివరములకు

**గాయత్రి మాత మందిరము మరియు ధ్యానకేంద్రము**

అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్, హైదరాబాద్-500018.

ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888

E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com



## 1. సర్వోచ్ఛమైన లాభము - ప్రతిభ

సృష్టిలోని సమస్త ప్రాణులతో పోలిస్తే మానవుడు అత్యంత విశిష్టతను పొందాడు. మానవుడి శరీర నిర్మాణము మరియు మానసిక-మస్తిష్కముల యొక్క విలక్షణతల కారణంగా అతను, సృష్టిలోని సమస్త ప్రాణులతో పోలిస్తే, శక్తివంతుడు, సమున్నతుడు మాత్రమే కాక తన సముదాయమును, తన చుట్టూ వున్న పరిస్థితులను వాతావరణమును దానితోపాటు భవిష్యత్తును కూడా అద్భుతముగా మలచుకోగల సామర్థ్యమును కలిగివున్నాడు. ఈ విశేషత ప్రయత్న పూర్వకంగా మాత్రమే లభిస్తుంది. రహదారిలో వెళుతుంటే దారిలో దొరికే వస్తువు కాదు. ఈ దివ్యవిభూతిని ప్రతిభ అంటారు. దీనిని ఎవరైతే సాధిస్తారో వారు నిజంగా మాటలలో వరిష్ఠులు - విశిష్టమైనవారు అని పిలువబడతారు, లేకపోతే మిగతా ప్రాణులతోపాటే గుంపులో గోవిందగా జీవితాన్ని సాగించేస్తారు.

మనిషి ఉడుత వలె చెట్టు ఎక్కలేడు. కోతివలె గంతులు వేయలేడు. ఎద్దుకు వున్నంత బరువును మోయగల శక్తి లేదు. పరుగుపెట్టటంలో చిరుతతో ఏమి పోలుస్తాము. కనీసము కుందేలుతో కూడా సమానంగా పరిగెత్తలేడు. పక్షుల వలె ఆకాశములో ఎగరలేడు. చేప వలె నీళ్ళలో మునగలేడు. చాలా విషయాలను గమనిస్తే మిగతా అన్ని ప్రాణులతో పోలిస్తే మానవుడు చాలా వెనుకబడి వున్నాడు. కానీ విశిష్ట మోతాదులో లభించిన

చతురత, కుశలతల వలన మిగతావాటికంటే వున్నతమైన స్థితిలో వున్నాడు.

వ్యవహారిక జీవితంలో మానవుడు మిగతా అన్ని ప్రాణుల కంటే అనేక దృష్టికోణాలలో చాలా ముందున్నాడు. ఇది అతని నియతి. చాలామంది మానవులు మిగతా ప్రాణులకంటే అధిక వసతులతో తమ జీతమును గడుపుతున్నారు. ఇంతేకాక, అతను మరింత సమర్థవంతమైన మహత్తును పొందుటకు అవకాశము కలదు. దీనికి ఒకే ఒక్క షరతు ఏమిటంటే ఈ శక్తిని పెంపొందించు కొనుటకు మానవుడు స్వయంగా అత్యంత ప్రయాస చేయవలెను. లోటుపాట్లను అధిగమిస్తూ, ఏది అత్యంత ఆవశ్యకమో, దానిని సాధించుట కొరకు అధికమైన జాగురూకతతో, తత్పరతతో మరియు తన్మయత్వముతో కృషి చేయవలెను. కేవలము భగవంతుని వరాల మీద ఆధారపడి సమున్నతుడు కాక తన పురుషార్థమును కూడా జోడించి ఉచ్చస్థాయికి చేరుకున్నాడు. ప్రతిభ యొక్క బలముపై ఆధారపడి ఇతరులకంటే సుసంస్కారములతో మరియు పరిపూర్ణతతో జీవిస్తున్నాడు. ముత్యాలను వెతికేవాడు నీళ్ళలోనికి దూకి అత్యంత లోతులకు వెళ్ళి వెతుకుతాడు. వజ్రాల కోసము వెతికేవాడు గనులలోకి వెళ్ళి ప్రతి అడుగు వెతుకుతాడు. ఇంతకంటే తక్కువ ప్రయాసలవల్ల ప్రతిభను పొందుట అసాధ్యము.

ప్రతిభ అనేది ఒక దైవీ స్థాయికి చెందిన విద్యుచ్ఛేతనము. అది మనిషియొక్క వ్యక్తిత్వములో మరియు కర్తృత్వములో



అసాధారణ స్థాయి ఉత్కృష్టతను చేకూరుస్తుంది. దీని ఆధారముగా అనేక సఫలతలు ఆశ్చర్యజనకమైన మోతాదులో లభిస్తూ వుంటాయి. దానితోపాటు మనిషికి అసాధారణమైన పేరు ప్రతిష్టలు, గౌరవములేకాక ఇతరులను అభ్యుదయమార్గంలో ముందుకు తీసుకుని వెళ్ళుటకు తగిన మార్గదర్శనము ఇవ్వగలిగే శక్తికూడా లభిస్తుంది. నావికుని వలె స్వయముగా తీరము చేరుటయేకాక ఇతరులను కూడా ఒడ్డుకు చేర్చగల శ్రేయస్సును పొందవచ్చు. క్రిందపడినవారిని లేవదీయుట, మునిగిపోతున్న వారిని రక్షించుట, ఏదో కాలయాపన చేసేవారిని అభ్యుదయము యొక్క ఎత్తులకు ఎగురవేయుట చేయగలడు.

ప్రతిభావంతులు అసాధారణమైన వారుగా ఉంటారు. వారిని వరిష్ఠులని, విశిష్టతకలవారని కూడా అంటారు. సాధారణ మానవులు జీవితాన్ని ఏదో విధంగా నెట్టుకుంటూ, సమస్యలను ఎదుర్కుంటూ, కావలసినవి సమకూర్చుకుంటూ, ఏదోవిధంగా రోజులు గడుపుతారు. పశు-పక్షులు మరియు పురుగులూ కూడా ఈ మాత్రము శక్తి, యోగ్యత కలిగివుంటాయి. కానీ ప్రతిభావంతుల విషయము వేరుగా వుంటుంది. వారు చుక్కల మధ్య చంద్రుని వలె మెఱుస్తూ వుంటారు. వారి వెలుగు చుట్టుప్రక్కల శాంతిని మరియు చల్లదనమును వెదజల్లుతూ వుంటుంది. వారు అందముగా వుండుటయే కాక, వారి పంచన వున్నవారుకూడా వారి యొక్క ప్రభావముతో, శోభతో అందముగా మెఱుస్తూ వుంటారు. దేనిని దర్శించటము వలన సర్వత్రా

చేతనత్వము యొక్క ఒక క్రొత్త ఉత్సాహపూరిత వాతావరణము ఏర్పడుతుందో, అలాంటి ఉదయించే సూర్యుడితో ప్రతిభావంతులను పోల్చవచ్చు. వారు ఊర్జా(శక్తి) మరియు వెలుగుతో స్వయముగా ప్రతిబింబించటమే కాకుండా వారియొక్క కిరణముల ప్రభావము ఎంత దూరమునకు వెళతాయో అక్కడ కూడా వెలుగును వెదజల్లుతారు. నరమానవుడిని శక్తిపుంజముగా మార్చగలిగే శక్తి ప్రతిభకు మాత్రమే వున్నదనుట నిజము. ప్రతిభ మానవుని, శరీరములో ఓజస్సుగా, మనస్సులో తేజస్సుగా, అంతః కరణములో విభూతితో నిండిన వర్చస్సుగా దృష్టిగోచరమవుతుంది. మానవుని అసలైన విశేష పరమ పురుషార్థము ఇదే. ఎవరైతే దీనికి వంచితులవుతారో వారికి మార్గము వెతికే అవసరము వుండదు. ఏదో గొఱ్ఱెల మందవలె గ్రుడ్డిగా ఏదో ఒకదాని వెంటడి వెళుతూ విధి ఎక్కడికి తీసుకువెళితే అక్కడకు వెళ్ళే వ్యక్తులు శక్తిహీనమైన పరాన్నభుక్కుల వలె జీవితాన్ని సాగిస్తారు, క్లిష్ట సమయాలలో బాధలను దిగమింగటానికి ప్రయత్నిస్తూ కన్నీళ్ళు కార్చి ఊరుకుంటారు.

ప్రపంచమంతా వెనుకబడినవారితో నిండిపోయింది. వారు జరిగినంత కాలము జీవితాన్ని లాగుతూ తిండికి-గుడ్డకు కరువై, అందరితో తిరస్కృతులై ఉపేక్షించబడి ఏదోవిధంగా జీవిస్తారు. నిజమైన సామర్థ్యము లేకపోవుట వలన కష్టములు మరియు తిరోగమనములకు బీజములు పడతాయి. దుర్వ్యసనములు దుర్బలమైన మనస్సుకలవారిపై స్వారీచేస్తాయి, వారిని అటూ ఇటూ అక్కడికి ఇక్కడికి లాగుతూ వుంటుంది. ఇలాంటి



పరిస్థితులలో వున్నవారు వారి తోటివారికి మరియు సమాజానికి కూడా ఒక సమస్యగా మారతారు. ఇలాంటివాళ్ళ పై అనాచారము చూచి అనాచారము తన పంజాను విసిరి దంతములతో గాట్లు వేసి కోరలతో బిగిస్తుంది. ప్రతిభారహిత సముదాయములతో భూభారము పెరుగుతుంది. వీరు సగము చచ్చిన వారి వలె ఇతరుల మీద ఆధారపడి వారి పంచన బ్రతుకుతూ ఉంటే, ఇక ఇతరులకు ఏవిధమైన సహాయము చేయగలరు?

ప్రపంచము ఎల్లప్పుడు ఇప్పుడు కనిపిస్తున్నట్లు అందముగా సుసజ్జితమై మంచి సంస్కృతితో, వున్నతిలో లేదు. ఆదికాలములో మనిషి కూడా వన్యమృగాల వలె ఆకలితో, దిశమొలతో తిరుగుతూ వుండేవాడు. ఋతువుల ప్రభావమునుండి తమను తాము అతి కష్టముగా కాపాడుకునేవారు. జీవించుట మరియు కడుపు నింపుకొనుట వీరికి ముఖ్య సమస్యలు. ఈమాత్రము లభించగానే వారు హాయిగా గాలిపీల్చుకునేవారు. ప్రపంచము అప్పుడు ఇంత అందముగా ఎక్కడ వుండేది? అప్పుడు ముళ్ళపొదలు, బంజరుభూములు, దట్టమైన వనములు, అడవి జంతువులు ఆహారమునకు, నీటికి మరియు నివసించుటకు ఎలాంటి వసతులు వుండేవి కాదు. అలాంటప్పుడు ఇతర సాధనాలను ఏర్పాటు చేసుకొనుట మరియు ఉపయోగించుకొనుటకు అవకాశ మెక్కడున్నది?

వస్తువులతో నిండిన దుకాణములు, వుద్యోగ-వ్యాపారములు, విజ్ఞాన-ఆవిష్కారములు, వసతులు, వస్తువులు, అస్త్ర-శస్త్రములు, అందమైన అలంకరణలు, శిక్షణ మరియు సంపదలతో

తులతూగుతున్న ఈనాటి ప్రపంచము దానంతటదే తయారుకాలేదు. ఇది మానవుని యొక్క ప్రతిభా వికాసంతోపాటు తన కళేబరమును కూడా విస్తరింపజేసుకున్నది. మొత్తము గొప్పతనము మనిషికి ఇచ్చినప్పటికీ నిజానికి అది సంపద మరియు బుద్ధి యొక్క ఆట అని ప్రపంచమునకు తెలుసు. ఇంకో రెండు అడుగులు ముందుకు వేస్తే సర్వతోముఖమైన ప్రగతికి ఆధారము ఒక్కటే కనిపిస్తుంది. అదే పరిష్కృతమైన ప్రతిభ. ఇది లేకపోతే అస్థిత్వము జీవచ్ఛవము.

ఈరోజులలో సంపదకు చాలా ప్రాముఖ్యత వుంది. దాని తరువాతే సామర్థ్యము, వివేకములను లెక్కిస్తారు. కానీ ఇంకా వున్నతమైన వైపుకు చూపును సారిస్తే దార్శనికులు, శాసకులు, కళాకారులు, వైజ్ఞానికులు, నిర్మాతలు మరియు జాగృతి చెందినవారిలో పరిష్కృతమైన ప్రతిభ యొక్క చమత్కారమును చూడవచ్చును. సాహసము కూడా దీని పేరే. దూరదృష్టి, వివేకశీలతగా కూడా దానిని తెలుసుకొనవచ్చును. ఎవరికైనా వున్నతి లేక విశిష్టతల గొప్పతనము లభిస్తుంటే అది వారిలో వికసించిన ప్రతిభ యొక్క చమత్కారమే. ప్రతిభను సాధించుట వలన గర్వము మరియు గౌరవము లభిస్తుందని అర్థము చేసుకొనవచ్చును. వ్యక్తి యాచకుడు కాకుండా, దానవీరుడుగా మారతాడు. అస్త్రశస్త్రముల యుద్ధనీతిని నిర్ణయించుట, పెద్ద పెద్ద బలిష్టులను ఓడించగల సామర్థ్యమును ఇస్తుంది. శక్తికి అన్నిచోట్ల నీరాజనాలు ఇవ్వబడతాయి. కానీ ప్రతిభ దాని బహుమూల్య అంశము. విజ్ఞానము దానినే అనుసరిస్తుంది. సంపద దీని చెలికత్తె.



పేరు- ప్రతిష్ట వాటంతటవే దానితో వుండుటకు పరుగులుపెట్టి వస్తాయి. ఇది కలిగినవారిని అందరూ కీర్తిస్తుంటారు. అనుసరించవలసిన మరియు అభినందించవలసినవారు ఈ విభూతిని పొందిన కొంతమందే వుంటారు.

దూరదృష్టి, సాహసము మరియు నీతి-నియమాల సమన్వయము ప్రతిభ రూపములో కనిపిస్తుంది. ఓజస్సు, తేజస్సు మరియు వర్చస్సు దీని యొక్క పేర్లే. పాలను వేడి చేస్తే మీగడ పైకి తేలుతుంది. జీవితంతోపాటు ముడిపడి యున్న మహత్వపూర్ణమైన ప్రసంగములను ఎదుర్కొనుటకు ప్రతిభే ముఖ్యమైన భూమికను నిర్వహిస్తూ వుండటము చూడబడుతుంది.

సాఫల్యములలో, ఉపలబ్ధులలో అనేక విశేషతల అవసరము వుంటుంది. వాటిని ఏకత్రితము చేసి ఒకే శబ్దములో కేంద్రీకృతము చేసినచో దానిని ప్రతిభ అని అనవచ్చును. ఇంకా విశదంగా చెప్పాలంటే మనలను, ఇతరులను, ప్రపంచమును మరియు వాతావరణమును కూడా ప్రభావితము చేసే **'సజీవశక్తి వర్షము'** ప్రతిభ.

రకరకాల ఉపలబ్ధులకు వాటి వాటి ప్రాముఖ్యత వుంటుంది. వాటిని పొందేవారు గౌరవింపబడతారు. ఇతరులు చమత్కృతులౌతారు. కానీ గుర్తుంచుకోవలసిన విషయ మేమిటంటే పరిష్కృతమైన ప్రతిభ లేకపోతే దురుపయోగమే జరుగుతుంది. దురుపయోగమువలన అమృతము కూడా విషము అవుతుందనే ఉక్తి ఇక్కడ అప్రసంగితము కాదు. శారీరక బల, సంపన్నులు

విప్లవవాదులుగా, ఆతంకవాదులుగా, అనాచారులుగా, ఆక్రమణలు చేసేవారుగా, అపరాధులుగా ఈ ఉపలబ్ధి యొక్క దురుపయోగము చేస్తారు. అనేకులను విపత్కరమైన పరిస్థితులలోకి త్రోసివేస్తారు. సంపాదన సరిగ్గా ఉపయోగించుకోకపోతే విలాసములకు, దుర్వ్యసనములకు అనవసరమైన ఖర్చుకు, తమ విగ్రహాలను నిలబెట్టాలనే అహంకార ప్రదర్శన మొదలగువాటికి ఖర్చుపెడుతూ వుంటారు. అవాంఛనీయమైన వ్యక్తులు మరియు పనులకు సంపద సహాయోగము లభించినప్పుడు అనర్థముల పరంపర కొనసాగుతుంది. చదువులు, తెలివితేటలు పెరిగినకొద్ది ప్రపంచాన్ని రచిస్తాయి. ఇందులో ఎన్ని చిక్కుముడులు వస్తాయంటే ఇందులో ఇరుక్కున్నవారు వలలో పడ్డ చేపవలె, వేటగాని చేతికి చిక్కిన పక్షుల వలె తమ దురదృష్టాన్ని తిట్టుకుంటూ వుంటారు. అందము బాగా ఎక్కువైతే అది వ్యభిచారవృత్తిలోకి దారితీస్తుంది. ఉన్నతాధికారులు, ఆఫీసర్లు, లంచములు తీసుకుని అవినీతిపూర్ణ ఆదాయముతో ఎలా పెద్దవారిగా చెలామణి అవుతారో చూస్తూవుంటే వీరు శారీరక శ్రమతో కడుపు నింపుకునే శ్రామికులయి వుంటే వెయ్యిరెట్లు మంచి జరిగి వుండేది అనిపిస్తుంది. ప్రతిభ, వైభవమును సంపాదించి పెట్టుటేకాక దానిని సదుపయోగము చేయుటకు వున్నతమైన మార్గములకు, సత్సంకల్పములకు మరియు సాహసించుటకు కూడా మార్గదర్శనము ఇస్తుంది. పెద్దరికము కూడా దీనిపైనే ఆధారపడి వుంటుంది.



## 2. ప్రతిభను మించిన సమర్థత లేనేలేదు

ఆదర్శవంత ప్రయోజనము, సునియోజనము వ్యవస్థ మరియు సాహసముతో కూడిన పురుషార్థము వీటన్నిటిని కలిపి ఒక పూలగుత్తి వలె చేస్తే దానికి ప్రతిభ అనే పేరు పెట్టినచో అతిశయోక్తి కానేకాదు.

సత్యమునకు వెయ్యి ఏనుగుల బలముంటుందని చెప్తారు. దానికి ప్రతిభతో కూడిన జాగరూకత, సాహసమును కూడా కలిపితే బంగారమునకు సుగంధము కలిపినట్లుంటుంది. అప్పుడు దానిని వెయ్యి ఏనుగులేమిటి లక్ష ఐరావతముల వంటి శక్తి సంపన్నత కలిగి వుంటుందని చెప్పవచ్చు. మానవ జీవితంలో అన్నింటికంటే ఇది పెద్ద శక్తి సంపన్నత మరియు సౌభాగ్యము అనికూడా అనవచ్చును.

ఉగ్రవాద ప్రదర్శన, ఏవో మంచి-చెడు పనులకు ఇతరులపై ఆధారపడి వారిచేత మంచి-చెడు పనులను చేయించుకుంటూ దోపిడిదారుల వలె దుస్సాహసము చేయుటను ప్రతిభ అని అనరు. అలా జరిగి వుంటే ఆతంకవాదులు, అపరాధు లందరినీ కూడా ప్రతిభావంతులు అని అనవచ్చును. కానీ వీరి అసలైన పేరు దైత్యులు లేక దానవులు. దాదాగిరి, ఆక్రమణ చేసే వ్యాపారము వల్ల పీడింపబడ్డవారు శాపములు ఇస్తూనే వుంటారు. అందరి మనస్సులలో వారిపై అశ్రద్ధే కాక, అసహ్యము మరియు శతృత్వము ఏర్పడుతుంది. వీరంతా తమ కక్షను

తీర్చుకోలేకపోయినప్పటికీ తలదన్నే వాడికి త్రాటిని తన్నేవారు దొరికినట్లుగా ఇటుకకు ఊయితో జవాబు ఇచ్చేవారు తప్పక తగులుతారు. ఎవరి ద్వారా జరిగితేనేమి ప్రకృతి తన లెక్కలను సరిచూసుకుని పైకి లేచిన బుడగలలోని గాలిని తీసే పనిని తానే స్వయంగా నిర్వర్తిస్తుంది.

విపరీత ఆచరణ చేస్తూ అదే ప్రతిభ అనుకుంటే ఈపాటికి ప్రపంచమును వారు మ్రింగేసివుండేవారు, అంతేకాక సన్మార్గంలో నడిచేవారు చరితార్థులయ్యే అవకాశము వుండేది కాదు. శరీరము మరియు దాని ఛాయ(నీడ) చూచుటకు ఒకేలాగా వున్నప్పటికి వాటి మధ్య భూమికి, ఆకాశానికి వున్నంత తేడా వుంది. మీసాలు మెలివేసి, కళ్ళు ఎగరేసేవారికి మరియు దర్పాన్ని ప్రదర్శించేవారికి లోటే లేదు. మోసము చేసేవారికి మరియు వలపన్నేవారి చేష్టలు మనము చూస్తూనే వుంటాము. కుక్కగొడుగుల వలె అంతమవుతూవుంటారు. ఈనాడు ప్రగతిశీలురు అనబడేవారు అవాంఛనీయ మార్గంలో నడుచుటవల్ల కార్యక్షేత్రము సర్వనాశనమౌతోంది.

ఈ వివరణను ఇవ్వడానికి కారణము ఎవరైనా ప్రగతిశీలత గురించి వాస్తవికతను అర్థము చేసుకోవడములో పొరపాటు చేయకూడదు. ఆతంకవాదులను ప్రతిభావంతులనకూడదు. ఉత్కృష్టతతోపాటు సాహసము ఎక్కడ వుంటుందో అక్కడ కస్తూరి వలె సువాసనలు వెదజల్లుతూ చందనము వలె చుట్టుప్రక్కల వాతావరణాన్ని ప్రభావితము చేసేది ప్రతిభ. గాంధీజీ యొక్క



పరామర్శ, సాన్నిధ్యము వలన చాలామందిలోని ప్రతిభ తీర్చిదిద్దబడి ఏకత్రితమై కార్యక్షేత్రములో దిగిన ఆ సామూహము దేశము యొక్క వాతావరణములో ధైర్య-సాహసాలకు ప్రాణం పోసింది. వారి ద్వారా జరిగిన పనులు, ఏర్పడిన మార్పుల చర్చ చిరకాలము జరుగుతూ వుంటాయి. గాంధీజీ వ్యక్తిత్వము వలన వికసించే అవకాశము పొందినవారివలన దేశమునకు స్వాతంత్ర్యము లభించింది. వారిలో నిజముగా ఆశ్చర్యజనక శక్తి ఉన్నది. ఇంగ్లాండ్ యొక్క ప్రధానమంత్రి చర్చిల్ భారతదేశము యొక్క వైస్‌రాయ్‌ని-గాంధీజీతో ప్రత్యక్షముగా కలిసే పరిస్థితి రాకూడదు అని చెప్తూవుండేవాడు. ఆయన సమీపమునకు వెళ్ళినవారు ఆయన మాయలో ఇరుక్కుపోయి మనిషిగా మారుతారు అని ఆయన భయం.

అంగులీమాలుడు అనే మహాదస్యుడు, బుద్ధుడిని చంపే పన్నాగము పన్నాడు. అతను ఖడ్గము తీసుకుని బుద్ధుని దగ్గరకు చేరాడు. సరిగ్గా ఆక్రమణ చేయబోయేముందు అతను నీరుకారిపోయాడు. ఖడ్గమును విసిరేశాడు మరియు ప్రాయశ్చిత్తముగా అతను వృత్తి అయిన దారిదోపిడిలను మానివేశాడు. అంతేకాక బుద్ధుని యొక్క శిష్యునిగా మారి తన యొక్క శేషజీవితము ధర్మమార్గమునకు సమర్పించాడు.

ఆమ్రపాలి అనే వేశ్య కూడా ఇలాంటి పన్నాగమునే పన్నింది. కాని ఆయన ఎదుటకు వెళుతూ వుండగా ఆమె పన్నిన పన్నాగము పటాపంచలయినది. ఆమె బుద్ధుని కాళ్ళమీద పడి, 'తండ్రీ!

నరకములోని పురుగు వంటి నన్ను పాపకూపములో నుండి బయటికి లాగండి' అని రోదించినది. బుద్ధుడు ఆమె శిరస్సుపై చేయిపెట్టి 'ఈరోజునుండి నీవు నా నిజమైన కుమార్తెవు, నీవే కాదు మానవజాతిని ఉద్ధరించే కార్యక్రమమును నాయొక్క వరదానముగా తీసుకుని వెళ్ళు.' ఆమ్రపాలి యొక్క జీవిత ఉత్తరార్థము లోకకళ్యాణమునకు ఎలా సమర్పించినదో అందరికి తెలుసు.

నారదుడు ఎక్కడా ఎక్కువసేపు వుండడు. కాని వారితో కొంత సమయము వుండి ఆయన యొక్క సలహా వలన ధ్రువుడు, ప్రహ్లాదుడు, రత్నాకరుడు మొదలగు ఎంతోమందిని వున్నతమైన స్థాయికి చేరుకున్నారు.

వేదవ్యాసుని యొక్క సాహిత్య-సృజన విశ్వవిఖ్యాతము. వారికి వ్రాయుటలో సహాయము చేసేందుకు గణపతి పరుగుపరుగున వెళ్ళాడు. భగీరథుడు పరమార్థము కోసము చేసిన సాహసము వలన పృథ్వి పైకి గంగ అవతరించినది. అవరోధములు వచ్చినప్పుడు శివుడు తన జడలను విసిరివేసి సహాయమును చేసేందుకు నిలబడ్డాడు. విశ్వామిత్రుని అవసరాలను అర్థము చేసుకుని హరిశ్చంద్రుడు తనని తానే సమర్పించుకున్నాడు. గాయత్రిమాత యొక్క సహకారము ఆ మహాఋషి జీవితంలో ఎల్లప్పుడూ లభించినది. తపస్విని అయిన అనసూయాదేవి లోగిలిలో త్రిమూర్తులు శిశువులుగా ఆడుకున్నారు.

జపాన్ గాంధీగా పేరుపొందిన 'కాగావా' వెనుకబడినవారిని



తీర్చిదిద్ది సమర్థుల వరుసలో నిలబట్టాడు.

మదనమోహనమాలవ్య, స్వామి శ్రద్ధానంద, శ్రీ అరవింద యోగి, రాజా మహేంద్ర ప్రతాప్, రవింద్రనాధ్ టాగుర్ లు స్థాపించిన శిక్షణా సంస్థలు ఎంతోమందిని వున్నత స్థాయికి చెందిన ప్రతిభావంతులుగా సమాజానికి సమర్పించాయి. ఇలాంటి సంఘటనలు ఎప్పటికి మర్చిపోలేము. వివేకానంద, దయానంద మొదలైనవారి ద్వారా జరిగిన మానవ కళ్యాణమును అసాధారణము అని చెప్పవచ్చును. ప్రతిభ ఎల్లప్పుడు ఇలాంటి కార్యక్రమాలనే తీసుకుని వాటిని సమర్థవంతముగా పూర్తిచేస్తుంది.

భారత గణతంత్రములలో అన్ని రాజ్యాలను కలుపుకోవాలని అనుకుంది. కానీ కొంతమంది రాజులు దీనికి ఒప్పుకోలేదు. అంతేకాక వారి శక్తిని చవిచూపించడానికి కత్తులను దూశారు. సర్దార్ పటేల్ గర్జించాడు 'ఈ ఖడ్గముల కంటే ఊడ్చేవారి చేతిలోని చీపురుకట్టులు అధిక శక్తివంతమైనవి. కనీసము అవి చేసింది కనిపిస్తుంది'. రాజులకు సర్దార్ పటేల్ ముందు సమర్పణ చేసుకోక తప్పలేదు.

రాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ, రాజా ఛత్రసాల్ మొదలైనవారి పరాక్రమములు ప్రసిద్ధి చెందినవి. వీరంతా అతి తక్కువ వసతులతో పోరాడిన పోరాటములు వీరిని అసాధారణ పరాక్రమశాలులురుగా నిరూపించాయి. లక్ష్మీబాయి మహిళ లందర్ని కలిపి ఒక సేనను తయారుచేసింది. సమర్థవంతులైన ఆంగ్లేయుల దుమ్ముదులిపింది.

చాణుక్యుని జీవిత చరిత్ర చదివినవారికి పరిస్థితులు, వసతులు ముఖ్యము కాదు. మనోబలము పైనే ఆధారపడి చేసి సాధించవచ్చో అర్ధమవుతుంది. శంకర దిగ్విజయ గాథ మానవుని ప్రతిభ ఎన్ని సాధనాలను సమకూర్చగలదో మరియు ఎంతెంత పెద్ద పనులను చేయగలదో తెలుపుతుంది. పరశురాముడు మొత్తము విశ్వములోని విద్రోహులందరి మనస్సులు ఏవిధముగా మార్చివేశాడు అనేది అందరికి తెలిసిన విషయము. కుమారజీవ్ ఏషియాలోని ఒక పెద్ద భూభాగమును భౌద్ధధర్మ అనుయాయులుగా మార్చి అతి కొద్ది సమయములో ధర్మక్షేత్రములో ఒక మహాక్రాంతిని చేసి చూపించాడు.

నెపోలియన్ భయంకర యుద్ధములో ఇరుక్కున్నాడు. చివరకు అతనితోపాటు ఒకే ఒక్కడు మిగిలాడు. ఎదుటినుంచి గుండ్ల వర్షము కురుస్తున్నది. తోటివాడు భయపడుతుంటే నెపోలియన్ 'భయపడకు, నా ఛాతిని చీల్చగల తూటా ఇంకా ఏ ఫ్యాక్టరీలోనూ తయారుచేయబడలేదు' అని చెప్పినాడు. ఆ పరిస్థితులలోకూడా ముందుకు వెళ్ళాడు. ఒకే ఒక్క హుంకారముతో మొత్తము శత్రుసేనలను తన సహాయకులుగా అనుయాయులుగా మార్చివేసుకున్నాడు. ప్రతిభ అలా వుంటుంది.

అమెరికాలోని అబ్రహమ్ లింకన్, జార్జ్ వాషింగ్టన్, ఇటలీలోని గైరిబాల్డీ మొదలగువారియొక్క గాథలు దిగజారిన పరిస్థితులను ఎదుర్కొని మానవుల మనస్సులలో తిష్ఠవేసుకొని రాష్ట్రపతి పదవులు చేపట్టటంలో సాఫల్యాన్ని పొందిన సంఘటనలు కూడా



ఇటువంటివే. లెనిన్ గురించి తెలిసినవారికి సామ్యవాదం యొక్క సూత్రధారుడుగా ఏమి చేసిచూపించాడో తెలిసినదే కదా.

వినోబాయొక్క భూదాన అందోళన, జయప్రకాష్ నారాయణ యొక్క సమగ్రక్రాంతి సహజముగా మర్చిపోయే విషయాలు కావు. భామాషా ఉదారత్వము దేశానికి ఎంతో మేలు చేసింది. బాబా సాహేబ్‌ఆమ్టే ద్వారా వెనుకబడిన వర్గాలవారికి చేసిన సేవ ఒక జీవిత ఆదర్శముగా ఇప్పటికి స్థిరముగా నిలిచిపోయింది. విశ్వవ్యాపి స్కౌట్ ఆందోళనలను నిలబెట్టినవారిలో వేడన్‌పావెల్ సృజనాత్మక ప్రతిభను ఎవరైనా ఎలా మర్చిపోగలరు? సుభాష్ చంద్రబోస్ యొక్క అజాద్‌హింద్ సేన అవిస్మరణీయమైనది.

భారతీయ సాహిత్యకారుల కష్టగాథలు మనము గుర్తు చేసుకుంటే, అవి చాలా ప్రేరణ నిస్తాయి. పుస్తకాల పెట్టెను నెత్తిన పెట్టుకుని తిరిగే భగవతీ ప్రసాద్ వాజపాయి, భిక్షాటన చేసుకుని పైకి వచ్చిన బాలకృష్ణ శర్మ 'నవీన్', గేదలను కాసే రామవృక్షబేనీపురీ మొదలగువారు ఘోరమైన కష్టాలనుండి పైకి లేచి గొప్ప సాహిత్యకారులుగా మారినారు. ఊరిలో చెత్తకుండీలలో దొరికే వస్తువులను ప్రోగుచేసుకుని జరుగుబాటు చేసుకున్న 'గోర్కి' విశ్వవిఖ్యాతమైన రచయిత అయ్యాడు. ఇదంతా ప్రతిభ యొక్క చమత్కారమే.

ఉన్నతికి అనేక క్షేత్రములున్నాయి. కానీ ఆ స్థాయికి చేరటానికి ప్రతిభే ప్రధానపాత్రను పోషిస్తుంది. కోటీశ్వరులలో హెన్రీ ఫోర్డ్, రాక్ ఫెలర్, ఆలఫ్రెడ్ నోబుల్, టాటా, బిర్లా మొదలైనవారు చాలా

పేరుగలవారు. వీరిలో ఎక్కువ శాతము ఈ స్థితికి రాకముందు రోజులలో సరైన వనరులు లేనివారు. వారి ఎదుగుదలకి తెలివితేటలు సహాయపడ్డాయి. కఠోరశ్రమ, ఏకాగ్రత, లక్ష్యమును సాధించాలి అన్న తపన నిజమైన సహాయాన్ని అందించాయి. లేనిచో ఎవరికైనా అనాయాసముగా, అదృష్టముకొద్ది లేదా పెద్దల ఆస్తిరూపములో ఏదన్నా లభిస్తే, ఆ స్థితిని సంరక్షింపగలడా మరియు దానిని మరింతగా వృద్ధిచేయగలరా అనే విషయములో విశ్వాసము కలుగుట కష్టము. కష్టముల నుండి పైకి లేచి వనరులను సమకూర్చుకొని స్నేహభావముతో సహకారమును ఏర్పరుచుకొనుటలో వ్యక్తియొక్క నిజమైన విశిష్టతే సహాయము చేస్తుంది. ఈ సద్గుణాలన్నీ కలిసినపుడు ప్రభావవంతమైన వ్యక్తిత్వము తయారవుతుంది. దీనిని ప్రతిభ అనవచ్చును, దీనిని ఏ క్షేత్రములో ఉపయోగించినా అచ్చట అభ్యుదయమార్గములో వెళ్ళే యోగ్యత కలుగుతుంది.

ప్రతిభను సాధించుకొనుటలో, అభివృద్ధి చేసుకొనుటలో ఎవరికైతే అభిరుచి వుంటుందో, గుణకర్మ స్వభావములను సువికసితము చేసుకొనుటకు ఎల్లప్పుడు ప్రయత్నము చేయుటకు తమ విశిష్టత యొక్క సార్థకతను తెలుసుకొన్నారో, వారికి తమ భవిష్యత్తును ఉజ్జ్వలంగా తీర్చిదిద్దుదకునే అవకాశము కలిగిందని తెలుసుకొనవలెను. అలాంటి వారికే ప్రజల స్నేహము, సహకారము లభిస్తుంది. ప్రపంచములో ఎక్కడ ప్రగతి కనిపించినదో అచ్చట సముచితమైన ప్రతిభే కారణము అని గ్రహించవలెను.



## 3. పరిష్కృతమైన ప్రతిభ ఒక దైవీ అనుదానము - వరదానము

సైనికులు యుద్ధరంగములో తమ పరాక్రమమును చూపించేందుకు తయారుచేయబడుతున్నప్పుడు అచ్చటికి పంపే శాఖ వారికి అవసరమైన చక్కటి వసతులను ఏర్పరుస్తుంది. లేనిచో వారు తమ కర్తవ్యమును సవ్యముగా నిర్వహించలేరు. నూతన సృజన ఆవిర్భావ సమయంలో యుగమును మార్చటానికి కావలసిన సరంజామాను చేకూర్చే సత్తా కూడా అన్నిరకముల వసతులను ఏర్పరిచే వుంచినది.

సాఫల్యము యొక్క ఉన్నత లక్ష్యమును చేరుకునేందుకు ఎన్నో అడ్డంకులు ఏర్పడతాయి. వాటిని ఎదుర్కొనేందుకు, కావలసిన ప్రగతి సాధించేందుకు అనేక అవసరాలను పూర్తిచేయవలసి వుంటుంది. ఆదర్శవాద మార్గములో ముందున్న వ్యక్తి నిరాశపడవలసిన అవసరము లేదు. ఎందుకంటే అత్యంత శక్తివంతమైన సత్తాయొక్క అభయహస్తము అతని వెన్నంటి వుంటుంది.

నడిచేవారినుండి సైకిలుమీద వెళ్లేవారివరకు గాలివాటము ఉన్న వైపే వెళ్ళటానికి ఎక్కువ శ్రమ పడనవసరము లేదు. గమ్యమును తేలికగా చేరుకొవచ్చును. ఇదేవిధముగా నవీన సృజన లక్ష్యము ఊహించేవారికి కష్టసాధ్యముగా అనిపించవచ్చు, కాని సృజనా యోజనను పూర్తిచేయుటకు ఎవరైతే తమ ప్రాణములను అరచేతిలో పెట్టుకొని ముందుకు నడిచే సాహసము చూపిస్తున్నారో, వారికి సాఫల్యముయొక్క లక్ష్యమును

అందించేందుకు ఏయే వనరులు సమకూర్చాలో మరియు ఎలాంటి బాధ్యతలను నిర్వహించాలో సృష్టికర్తకు తెలుసు.

అడుక్కునేవాళ్ళు, ఇంటింటికి వెళ్ళి జోలెను ముందుకు చాపి, పళ్ళు బయటికి పెట్టి, పొర్లుకుంటూ అడుక్కుంటున్నప్పుడు అందరూ చీదరించుకుంటారు. మనస్సులోని కోర్కెలు తీర్చుకోవడముకోసము ఈశ్వరునిపై భక్తిని నటిస్తూ ఇలాంటి నిరాశా, ఉపేక్షను చాలా మంది భరిస్తారు. కాని ఎవరైతే భగవంతుని పనిని చేయదల్చుకుంటారో వారిని సాదరంగా ఆహ్వానించటము జరుగుతుంది. మరియు అవసరమైన వనరులు బహుమతిగా సమకూర్చబడతాయి. ఈకాలములో అవసరము భగవంతుడిది. ఆయన ఉద్యానవనమును తీర్చిదిద్దడానికి తెలివితేటలు గల మాలి కావాలి. ఆయన ప్రపంచమును సమున్నతము, మంచి సంస్కారములతో సుసంపన్నముగా తయారుచేయుటకు కౌశలముగల కళాకారులు మరియు శూరవీరులైన సైనికుల అవసరము వున్నది. ఎవరైతే ఆయన పనిలో తమ సామర్థ్యము నందిస్తారో వారు దైవీ అనుగ్రహమునకు పాత్రులవడమేకాక, వారు ఎంత ఎక్కువ పొందగలరంటే వారి జీవితాలు ధన్యమవుతాయి. వారి మనస్సులు ఎల్లప్పుడు ఆనందముగా ఉంటాయి.

హనుమంతుడు సుగ్రీవుని వద్ద రక్షక కర్మచారిగా వుండేవాడు. భయభీతితో వున్న సుగ్రీవుని వద్దకు ఇద్దరు ఆగంతకులు మారువేషములో వచ్చారనుకొని ఇతను కూడా మారువేషములోనే వెళ్ళాడు. మారువేషములో వున్న రామలక్ష్మణుల దగ్గరికి



వెళ్ళినతర్వాత, వినయపూర్వకముగా తలవంచి మంచి-చెడు ప్రశ్నించాడు. కాని తరువాత పరిస్థితి మారినది. సీతను వెతుకుటలో రాముడికి హనుమంతుడి అవసరము ఏర్పడినది. రామ విన్నపము స్వీకరించగానే హనుమంతునకు అంతవరకు లేని అశేషమైన సామర్థ్యము లభించినది. సముద్రమును దాటుట, లంకను తగలపెట్టుట మరియు పర్వతమును పెకలించి తీసుకొనివచ్చుట వంటి అసాధారణమైన పనులు దానితో సాధించగలిగాడు.

భగవంతునికి అవసరమైన సమయములో పనిచెయ్యటానికి వచ్చినవారికి కూడా ఇలాంటి వరములు, అనుదానములు లభిస్తాయి. విభీషణుడికి లంకాధిపతి అయ్యే యోగ్యత ఏర్పడినది. సుగ్రీవుడు, తాను పోగొట్టుకున్న రాజ్యమును తిరిగి పొందినాడు. భగవంతుని పనికొరకు దేవపుత్రులను అడిగిన కుంతికి ఉత్కృష్ట స్థాయి పుత్రరత్నాలనివ్వడానికి వారు వెనుకాడలేదు. భక్తిని ప్రచారము చేసిన నారదుడు దేవర్షిగా పిలువబడ్డాడు. సూరదాస్, తులసీదాసులు ఈశ్వరుని పనిచెయ్యటానికి ప్రతిజ్ఞారతులై ప్రతిభను పొంది అనంతమైన కీర్తి పొందుటకు అధికారులైరి.

ఈ సమయములో సృష్టికర్త విశ్వకళ్యాణము కొఱకు, నవీన సృజన కొఱకు, కర్మవీరులకు పిలుపునిస్తున్నాడు. దీనికొఱకు తమ చేతిని చాపినవారు వట్టి చేతులతో ఎందుకుంటారు? భగీరథుడు, గాంధీ, బుద్ధుడు మొదలగువారికి లభించిన సామర్థ్యము పరమార్థం యొక్క ప్రయోజనములో ఉపయోగపడినందుకే లభించినది.

ఈ ప్రపంచములో అప్పుడప్పుడు చాలా విలువైన వస్తువులు

ఎలాంటి మూల్యము చెల్లించకుండానే దొరుకుతాయి. ఉదాహరణకు గాలి, నీరు, నీడ, సువాసనలు మొదలగునవి. కాని కిరాణా దుకాణములో గాని లేక మిఠాయి దుకాణములో గాని అలంకరింపబడి వున్న వస్తువులను ఉచితముగా తీసుకొనివెళ్ళు నియమము ఎక్కడా లేదు. వాటికి మూల్యము చెల్లించవలసి ఉన్నది. ఆవుకు గడ్డి వెయ్యకపోతే పాలు ఇచ్చుట కష్టము.

భగవంతుడు సుదాముడికి ద్వారకాపురిని, పాడుపడిన సుదామాపురి బదులు స్థానమార్పిడి చేసి ఇచ్చాడు. కాని ఆ స్థానమును విశ్వవిద్యాలయమును నడిపేందుకు ఉపయోగిస్తారనే విశ్వాసముతోనే ఈ అనుగ్రహమిచ్చాడు. చాణుక్యుని శక్తి చంద్రగుప్తునికే లభించినది. అందువల్ల అతను చక్రవర్తి అయ్యాడు.

భవానిమాతయొక్క అక్షయఖడ్గము శివాజీకి లభించినది. అర్జునుడికి దివ్యగాండీవ ధనస్సును ప్రసాదించినవారు వరమును ఇచ్చుటకు ముందే అతని సామర్థ్యమును దేనికి వుపయోగించాలి అనేది నిర్ణయించుకున్నారు. ముందువెనుక చూసుకోకుండా ఎవరికైనా ఏదైనా యిస్తే భస్మాసురుడివలన శివుడు పడిన కష్టములు భరించవలసివస్తుంది.

భగవంతుడు ఈ శరీరమును ముందుగానే మనకు ఉచితముగా ఇచ్చాడు. దానితరువాత రెండవ వరము 'పరిష్కృత ప్రతిభను' ఇచ్చాడు. దీని సహాయముతోనే ఎవరైనా మహామానవుని స్థాయికి ఎదిగే అవకాశము లభిస్తుంది. ఇంతటి బహుమూల్యమైన సంపదను పొందుటకు లోకకళ్యాణముకొరకు వివేకానందుడు



చూపించిన సాహసమును కూడదీసుకోవలసి వుంటుంది. ఇది పరీక్షా సమయము. ఈ సమయములో విశేష దైవీ అనుగ్రహములు ఉన్నతమైన ప్రయోజనములకొరకే ఉపయోగింపబడుతాయి అన్నది నిరూపించుకోవాలి. ఈరోజులలో నవయుగావతరణకొరకు మార్గమును ప్రశస్తము చేయవలెను. ఇది చాలా పెద్ద పని. దీనికొరకు నడుంబిగించి నిలబడుట వలన పరిష్కృతమైన ప్రతిభను ఎక్కువ మోతాదులో పొందగలిగే అనుగ్రహము లభిస్తుంది. దానిని ధరించుటవలన వజ్రాల హారము ధరించినవారివలె శోభాయమానము కావచ్చు.

భగవంతుని వ్యవస్థలో ముందు నాటాలి తరువాత కోసుకోవాలి. ముందు కోసుకుని తరువాత నాటుకునే పద్ధతి లేదు. లోకంకొరకు సేవ చేసే ఉన్నత ఆదర్శములు కల విశ్వసనీయ వ్యక్తులు ఉచ్చప్రయోజనాలకు ప్రతినిధులుగా ఎన్నుకోబడతారు. విశేషమైన పురుషార్థమును నిరూపించుకున్నాకే బహుమతులు లబిస్తాయి. పరిష్కృతమైన ప్రతిభ కంటే మనిషిని గౌరవవంతునిగా చేయగల మరియే యితర సాధనము లేనేలేదు. దీనిని పొందుటకు ముందుమానవుని గౌరవనీయునిగా చేసే ధర్మధారణా క్షేత్రములో ఎంత ఉదారత్వము మరియు ఎంత సేవా సాధనములను చూపించగల్గే సాహసమును చేకూర్చుకొన్నాము అనేది సిద్ధింప చేసుకోవాలి.

ఇతరుల చేతికి గోరింటాకును పెట్టేందుకు ఆకులు రుబ్బుతున్నప్పుడు, రుబ్బేవారి చేతులు ఎఱ్ఱగా అవుతాయి. సమయానుసారంగా పుణ్యములోను, పరమార్థములోను

పాల్గొనేవారు ఎల్లప్పుడు లబ్ధినే పొందుతారు. ఒక్క బీజము వెయ్యి బీజములుగా మారినట్లే ఈ సత్యమునకు ప్రమాణము మరియు పరిపుష్ఠి లభిస్తుంది. భగవంతుని బ్యాంక్‌లో జమచేయుటవలన లభించే ప్రతిఫలము మరి యే ఇతర వ్యాపారంలోనూ లభించదు.

పరమార్థముకొరకు వారు చేసే పనిమీద ఆధారపడి వరిష్టతను నిర్ణయించడము జరుగుతుంది. శ్రేష్ఠమైనవారు-వరిష్టమైనవారలను ఈ ఒక్క ఆధారముపైననే నిర్ణయించడము జరుగుతోంది. పెద్ద పనులను చేయుటకు వారి మానసికస్థితే పనికొస్తుంది అనేదికూడా విశ్వసించవలసిన విషయము. పట్టాలు తప్పిన ఇంజనును లేపి మళ్ళీ అదే స్థానములో పెట్టుటకు చాలా దృఢమైన పెద్ద క్రేన్ అవసరము. ఉరవళ్ళు త్రొక్కుచున్న నదిలో సుడిగుండాలు ఏర్పడితే, ఊగిసలాడుచున్న నావను అదుపులోకి తెచ్చుకొనుటకు బలవంతులైన నావికులు కావలెను. అత్యంత విస్తారమైన సంసారమనే సాగరంలో చిక్కుకొని వున్న ఎన్నో సమస్యల వలయాలను విడదీయుట ఎంతో సాహసవంతులైన మరియు మేధావంతులైనవారికే సాధ్యము. వీరినే ప్రతిభావంతులు అనే మరో పేరుతో కూడా పిలుస్తాము. యుగపరివర్తనమువంటి గొప్ప ప్రయోజనములను చేతిలోకి తీసుకొనుటకొరకు తమ సాహసమును నిరూపించుకోగల్గిన వ్యక్తులు కావలెను. సరైన సమయాలలో ఇలాంటి ప్రఖర ప్రతిభావంతులను వెదకి తీర్చిదిద్దివాడుకోవలెను.

సంచిత అనాచారములన్ని కలసి విస్ఫోటనము చెందే అవకాశము ఈ రోజులలో ఉన్నది. దానిని ఆపకపోతే



మహాయుద్ధము సంభవించవచ్చు. పెరుగుతున్న కాలుష్యము, భయంకరంగా పెరుగుచున్న జనసంఖ్య, బాగా పెరుగుచున్న అనాచారములు అన్ని కలసి మహాప్రళయము లేక ఖండప్రళయము వంటి స్థితి ఏర్పడవచ్చు. దానిని ఆపుటకు చాలా శక్తివంతమైన అవరోధము కావాలి. దీనికెంత పెద్ద అవరోధము కావలెనంటే, పొంగిపొరలుచున్న నదులపైన వారధి కట్టి మొత్తము జలాన్ని కాలువలద్వారా ఒక్కొక్క పొలమునకు చేర్చగలిగేంత పెద్ద శక్తి కలది కావలెను. అది సాధారణులవలన అయ్యేపనికాదు. అసాధారణులయొక్క పని.

తాజ్‌మహల్, ఈజిప్ట్ దేశపు పిరమిడ్; చైనాగోడ, ఫ్రాన్స్‌లోని మినార్, సూయజ్ మరియు పనామా కాలువలు, హాలెండ్‌లో సముద్రాన్ని వెనుకకు తోసి ఆ స్థానములో చాలా రమ్యమైన నగరమును నిర్మించడంవంటి అద్భుతమైన సృజనాత్మక కార్యక్రమములు ఎక్కడెక్కడ నిర్మింపబడుతున్నాయో అవన్నీ మొదట ఎవరో ఒక వ్యక్తి మనస్సులోని సంకల్పంవలననే ఉద్భవించి ఉంటాయి. తరువాత సహాయము చేసేవారి సమూహము ఏర్పడుతున్నది. మరియు హద్దులేనన్ని వనరులు వ్యవస్థీకృతమవుతూ వస్తాయి. నవయుగావతరణ కూడా వీటన్నింటికంటే పెద్ద కార్యక్రమము. ఎందువలనంటే ప్రపంచముయొక్క సమస్త జనసముదాయానికీ ఏదోవొకరకంగా ఈ కార్యక్రమముతో సంబంధము కలిగివున్నది. ఇంత పెద్ద పరివర్తనకు కృషి చేసే అగ్రదూతలు ఎవరవుతారు? ముందువరుసలో ఎవరుంటారు? అవసరమైన సామర్థ్యమును,

సంపదను ఎవరు సమకూరుస్తారు? ఈ ప్రణాళిక నిశ్చయముగా అసాధారణమైనదేగాక, ఊహించలేనంత గొప్పది. ఇది మనస్వీల సహకారముతోనే జరుగుతుంది. ఆలోచించవలసిందేమిటంటే ఇంత పెద్ద వ్యవస్థను ఎలా ఏర్పరచాలి?

మొదట ఈ కార్యక్రమము అసంభవంగా అనిపిస్తుంది. కానీ ప్రపంచములో అసంభవాలను సంభవాలు చేసినవారు చాలామంది ఉన్నారు. ఆల్ప్స్ పర్వతములను దాటుటకు ప్రణాళికను వేసిన నెపోలియన్‌తో సృష్టి ఏర్పడినప్పటినుండి ఇప్పటివరకు ఎవరూ చెయ్యలేని పనిని మీరు ఎలా చేయగలరని అనుకుంటున్నారు అని ప్రశ్నించారు. జవాబు చాలా గొప్పగా వున్నది. అసంభవము అనే శబ్దము మూర్ఖుల నిఘంటువులోమాత్రము వ్రాసివుంటుంది. ఆల్ప్స్ దారివ్వకపోతే దానిని ఇదే కాళ్ళతో పొడి పొడి చేస్తానన్నాడు నెపోలియన్. అమెరికాను వెదుకుటకు బయలుదేరిన కొలంబస్‌ని కూడా ఇలాంటి ఉదాహరణగానే చెప్పవచ్చు. సముద్రంనుండి గ్రుడ్లను వెనక్కి తెచ్చుకొనుటలో అసఫలమైనప్పుడు కొక్కెఱాయి తన ముక్కుతో ఇసుకను నింపి సముద్రంలో వేసి సముద్రాన్ని ఇసుకతో సమతుల్యము చేయాలి అన్న సంకల్పాన్ని ప్రకటించినది. మరియు దానికోసము ప్రాణమైనా వదిలేందుకు సిద్ధమైనది. ప్రకృతి దాని సంకల్పమునకు సహాయము చేసినది. అగస్త్యముని వచ్చి సముద్రపు నీటిని త్రాగివేశాడు. కొక్కెఱాయికి తన గ్రుడ్లు వెనక్కొచ్చాయి. ఫరహాద్ కొండను త్రవ్వి 32 మైళ్ళు పొడుగు కాలువను త్రవ్వి అసంభవమైన కార్యము సంభవము చేయవచ్చు అని చేసి చూపించాడు. దీనినే ప్రతిభ అంటారు.



## 4. ప్రచండమైన మనోబలము ప్రతిభగా పరిణితి చెందుతుంది

సీతాపహరణ తరువాత రావణుడిని ఓడించవలెననే ప్రశ్న ముందుకొచ్చినపుడు రాముడిద్వారా పంపించిన నిమంత్రణను ఆరోజులలోని రాజులు మరియు బంధువులు స్వీకరించలేదు. కానీ దృఢమైన సంకల్పము అసంపూర్ణమైనప్పుడు దివ్యవ్యవస్థనే ప్రశ్నించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అదికూడా అంగీకారము కాదుగదా. ఈ పౌరాణిక గాథను గుర్తుంచుకోవలసినదే.

'ఏది వెతికితే అదే దొరుకుతుంది' (జిన్ ఖోజా తిన్ పాయియాం) అనే సామెతను అనుసరించి వెతకడము మొదలెట్టినప్పుడు అల్పులైన వానరులనుండి కూడా ఆదర్శము నిర్వహించుటకొరకు ఒకరికిమించి ఒకరు బరువైన బాధ్యతను ఎత్తుటకు ఆత్రుతపడే మానసికస్థితిలో ముందుకొచ్చారు. వారినుండి ఒక మంచి బలమైన మండలి ఏర్పడి కార్యక్షేత్రములోకి దిగి పనిచేసేందుకు కటిబద్ధులయ్యారు. కోతులు కట్టెను - ఱాళ్ళను చేరవేశాయి. భల్లూకములు ఇంజనీర్ల బాధ్యతను నిర్వహించాయి. దానితో సముద్రముమీద వంతెన నిలబడింది.

తమకుతాము సహాయము చేసుకునేవారికే ఈశ్వరుడు సహాయము చేస్తాడు. ప్రతికూల పరిస్థితులు ప్రక్కకి జరిగి అనుకూలమైన పరిస్థితులు తోడవుతూవుంటాయి. లంకపై

విజయము మరియు శ్రీరాముడు అయోధ్య తిరిగిరావడము సర్వవిదితమేగదా! సీతకూడా ఎన్నో బంధములనుండి తప్పించుకొని తిరిగొచ్చినది. ఇక్కడ రెండు విషయాలు చాలా నిక్కచ్చిగా చెప్పవచ్చు. ఒకటి రాముని ప్రతిభపై నమ్మకముతో వరిష్ట వానరులు ఉత్సాహమును మరియు సాహసమును చూపించారు మరియు రాముని దళములోని మూర్ధన్యులు సామన్యస్థాయిలోని వానరులలో కూడా ప్రాణచేతనత్వము నింపి సమర్ధవంతమైన వ్యక్తులయొక్క ఒక పటిష్టమైన సమూహము తయారుచేశారు. రెండవవైపు సమర్థవంతమైన శాసనాధ్యక్షులు కూడా రావణుని సామర్థ్యము మరియు తమ దుర్బలతను చూసి భయపడ్డాడు. మరియు ఇరకాటంలో పడతామని భయపడి తప్పించుకున్నారు. అంటే పరిష్కృతమైన ప్రతిభ ఉంటే, బలహీనులైన వారి సహకారంతో కూడా ఒకదానికి మించిన మరొక పెద్ద పనులను సాధించవచ్చు. అలాగే భయపడితే సమర్థవంతమైన వ్యక్తి కూడా కాళ్ళు-చేతులు ముడుచుకొని కూర్చోవచ్చు. రాణాప్రతాప్ సైనికులలో ప్రముఖులు అధికశాతము బాగా వెనుకబడినవారిగా చెప్పబడే ఆదివాసులు. రాణిలక్ష్మీబాయి ఇల్లు అనే పంజరంలో బందీగా వున్న మహిళలను ప్రోత్సహించి యుద్ధక్షేత్రంలో వీరసైనికుల వలె నిలబెట్టింది. రాణిలక్ష్మీబాయి తన కాలంలో పేరొందిన బందిపోటు సాగర్‌సింహ్ దోపిడి చేసి పారిపోతూవుంటే తన స్నేహితురాలు సుందరి సహాయముతో బందీనిచేసి దర్బారుకి తెచ్చినిలబెట్టింది. ఆమె ధైర్యంముందు అతనిలోని దుస్సాహసము



నశించింది. రాణి చివరికి అతనిని తన సమూహములో చేర్చుకొని అతని ప్రతిభను మంచిపనికి వుపయోగించి తన సేన యొక్క శక్తిని పెంచినది.

సాధారణమైన మనుష్యులలోని ప్రతిభను పైకితీసి సాహసము అనే ధనము కలవారు పెద్దపెద్ద పనులను చేశారు. చంద్రగుప్తునికి పెద్ద సామ్రాజ్య బాధ్యతను నిర్వహించేందుకు కావలసిన యోగ్యత లేదు, కానీ చాణుక్యుడు అతనిలో ప్రాణమును నింపి తన ఆదేశానుసారము నడుచుకొనుటకు ఒప్పించాడు. అర్జునుడు మహాభారతయుద్ధరంగంలో సైన్యాన్ని చూసి సంభాళించగలనన్న ధైర్యమును కోల్పోయి తటపటాయించాడు. కానీ కృష్ణుడు తను చెప్పినట్లుగా చేసేటట్లు అతనిని మలచుకున్నాడు. సమర్థగురురామదాను అత్యున్నత మనస్విత శివాజీ పరాక్రమమును వెలికి తీసింది. వివేకానందుడిని ఒక సాధారణ విద్యార్థిస్థాయినుండి పైకి తీసుకొచ్చి ప్రపంచమంతటా భారతీయసంస్కృతి యొక్క సందేశాన్ని అందించే స్థాయికి తీసుకొచ్చిన ఘనత శ్రీరామకృష్ణపరమహంసదేకదా! దయానందుడి ప్రగతి వెనకాల విరజానందుని ప్రోత్సాహము ఎంతగానో వున్నది. తోటివారి మరియు మార్గదర్శకుల ప్రతిభ ఎవరి మీద తన "ఆవేశము"ను ఆరోపిస్తుందో వారు అతి క్రింద స్థాయిలో ఉన్నా, అత్యంత ఉన్నతస్థాయికి చేరుకుంటారు.

పనిముట్లు-ఆయుధాలు సరిగ్గా పనిచేయాలంటే వాటిని ఎప్పటికప్పుడు పదును పెట్టవలసిన అవసరమున్నది. దీనికొరకు

బండఱాయిపై గీసి సానబెట్టి, నిప్పులలో కాల్చవలసిన అవసరమున్నది. వస్తాదుకూడ ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లి కుస్తీలో పాల్గొనలేడు, దానికొరకు చాలాకాలంపాటు నిరంతర అభ్యాసము చేయవలసి వుంటుంది. ప్రతిభ కూడా ఒకేసారి పరిష్కృతస్థాయికి చేరదు. దానికొరకు ప్రతిదినము అవాంఛనీయ సంఘటనలను ఎదుర్కొంటూ సుసంస్కారవంతమైన ఆదర్శములను అభివృద్ధి చేసుకొనే పద్ధతిని నిరంతరము పాటించాలి. సమాజసేవ రూపంలో ఇతరులతోకూడా యీ ప్రయత్నాన్ని కొనసాగించాలి. సమాజంలో ఇలాంటి అవకాశము ఎల్లప్పుడు లభించదు. నిత్యజీవితంలో మరియు కుటుంబంలో పరిష్కరించుటకు, సంస్కారములను ప్రోది చేయుటకు ప్రతిదినము పరిస్థితులు ఉండనే ఉంటాయి. రోజూ ఇంటిని ఊడ్చుకోవడము, స్నానము చేయడము, బట్టలుతుక్కొనుట అవసరము. మన గుణ కర్మ స్వభావంలో పూర్వసంచిత కుసంస్కారముల వల్ల, పరిచయస్తుల సంపర్కంవలన ఔచిత్యము కానివి ఎన్నో మెడకు చుట్టుకుంటాయి. వీటిని నివారించుటకు మనము ప్రతిక్షణము యుద్ధము చేస్తూ నయానో-భయానో నచ్చ చెప్పుకుంటూ  స్వచ్ఛత, సద్గుణములను ఎల్లప్పుడూ వుండేటట్టుగా చూసుకొనవలెను. అంతేకాక ఆదర్శములను పాటించుట అనేది స్వభావములో ఒక అంగంగా మారాలి. దీనికొరకు ఇతరులనుండి సహాయము ఆశించలేము.

చిన్నపిల్లలు తమ కృషితోనే ప్రాకటం మరియు లేచి నిలబడే



ప్రయత్నము చేస్తారు, అప్పుడే వారికి నడిచే, పరిగెత్తే సామర్థ్యము వస్తుంది. తనకి తాను వ్యక్తిత్వములోని ప్రతీ పక్షములోనూ సమున్నతము చేసుకునేందుకు నిరంతరము అవకాశముకొరకు వెతుకుతూ ప్రయత్నము చేస్తూవుండాలి. ఈ సందర్భంలో ఆత్మనిరీక్షణ, ఆత్మసమీక్ష, ఆత్మను తీర్చిదిద్దుకొనుట మరియు ఆత్మవికాసము కొరకు తన దినచర్యలో ప్రగతిశీలతను అభ్యాసము చేసే పద్ధతిని అలవరచుకోవాలి. ఇదేవిధంగా శరీరదృష్టి నుండి ఒక అడుగు ముందుకువేసి కుటుంబము-గృహమును శ్రేష్ఠము, సమున్నతము చేసినప్పుడే వారి భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుంది. ఈ శోధన క్రియలో శ్రమశీలత, క్రమబద్ధత, మితవ్యయము, సువ్యవస్థ మరియు సహకారము అనే ప్రవృత్తులు అందరి అలవాటుగా మారటానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్ట వలసి ఉంటుంది. లేనిచో ఇతరులకు ఉపదేశించడములో అందరూ కుశలురే (పర్ ఉపదేశి కుశల్ బహుతెరే) అయితే అపహాస్యము, తిరస్కారము మాత్రమే చేతికి లభిస్తాయి. మన యోగ్యతను-సామర్థ్యమును పెంచుకున్న తరువాత మాత్రమే యితరులపై అనుకున్న ప్రభావమును చూపగలము, వారి ప్రవర్తనను సరిదిద్దగలము.

రైల్ ఇంజన్ తన సామర్థ్యముపై పనిచేస్తుంది. మరియు తన సాధనములతో వేగముపుంజుకుంటుంది. అలాంటప్పుడే దానికి జోడింపబడియున్న రైలుపెట్టెలు కూడ సరియైన మార్గంలో గతిశీలము అవుతాయి. ఇంజన్‌యొక్క సామర్థ్యము

అస్తవ్యస్థమైనప్పుడు ఆ రైలు లక్ష్యమును చేరుట అటుంచి ఇతరులను కూడా లక్ష్యము చేరకుండా ఆపివేస్తుంది.

ఇతరులనుండి సహాయము లభించవలెనంటే ముందుగా మన పాత్రతను వికసింపజేసుకొనుటకు అసాధారణమైన ప్రయత్నము చేయాలి. పాత్రతే ప్రకారాంతరముగా సాఫల్యంవంటి పురస్కారములను వెంటబెట్టుకుని వస్తుంది. వర్షఋతువు ఎన్నాళ్లున్నా, వాన ఎంత కుండపోతగా కురిసినా దక్కేదిమాత్రం మన వద్ద వున్న పాత్ర పరిమాణమునుబట్టి లేదా గొయ్యి యొక్క లోతును బట్టి ఉంటుంది. ఆరోజులలో అంతటా పచ్చదనము మొలకెత్తుతుంది. కానీ బండఱాయిపైన ఒక గడ్డిపోచ కూడా మొలవదు. సారములేని భూమిలో ఏ బీజమూ మొలకెత్తనే మొలకెత్తదు. విద్యార్థికి పై తరగతిలోకి ప్రవేశించటానికి లేదా పురస్కారాలు గెల్చుకోవటానికి స్కాలర్‌షిప్ పొందే అవకాశమూ ఎవరి కృపవలనా లభించదు. దానికి బాగా శ్రమించడమువలన వచ్చే యోగ్యత మాత్రమే పనికొస్తుంది. పోటీలో ఎవరోఒకరి అనుగ్రహంవలన గెలవవచ్చు అనే ఆశ ఎవరికివుండదు. తమ సామర్థ్యము దక్షతలను పెంచుకొని పోటీలో గెలిచి సాఫల్యమును పొందిన వ్యక్తుల మధ్య కూర్చొనే ప్రతిష్ఠను సంపాదించు కుంటారు. తపస్సును తీవ్రంగా చెయ్యగలిగినవారే దేవతల అనుగ్రహాన్ని పొందగలరు. యత్నించకుండా కంచంలో వున్న అన్నము నోట్లోనికి, కడుపులోకి ఎలా వెళుతుంది? మహాశక్తులు ఎవరిపై అనుగ్రహాన్ని చూపిస్తాయో వారిని ముందుగా ఉన్నతివైపుకు



మరియు ప్రబలపురుషార్థము చేకూర్చుకునేందుకు కావలసిన ప్రేరణనిస్తాయి. ఆ తరువాతే వారి సహాయము ఉపయోగపడుతుంది. కుపాత్రులు మానవీయ లేక దైవీ సహాయము ప్రయత్నము ఏమీ లేకుండా సాఫల్యము, సిద్ధులు, విభూతులతో వారిని అలంకరిస్తుందని అనుకొనుట వ్యర్థము. బలహీనతను కలిగివుంటే ప్రకృతి, దైవంకూడా అనుకూలించదు. బలహీన శరీరంలోనే విషాణువులు రకరకాలుగా విస్తరించుకుంటాయి. శీతల ఋతువు సర్వులకు ఆరోగ్య సంవర్ధనకు ఉపయోగపడుతూ క్రిమికీటకాదులు, ఈగలు, దోమలు వంటివాటిని నిర్మూలన కూడా చేస్తుంది.

రహదారిమీద బస్సులు, కార్లు పరిగెడుతుంటాయి. కానీ నిజానికి లోపల ట్యాంకులో వున్న మండేగుణము గల ఇంధనము యొక్క చమత్కారమని తెలిసినవారు గుర్తిస్తారు. ఇంధనము అయిపోతే లోపల కూర్చుని ప్రయాణించేవారు దిగి తమ చేతులతో దానిని తోయవలసి ఉంటుంది. అలాగే మనుష్యునిద్వారా అనేకమైన చమత్కారవంతమైన పనులు జరుగుతున్నట్లు కనిపిస్తుంది, అవి కేవలము రక్తమాంసములు ఉన్న శరీరము వల్ల కాదు. పొంగిపొరలుచున్న కోరికల రూపంలో ఉన్న ప్రతిభ పనిచేస్తుంది. ఇతరులతో పోల్చి చూసినప్పుడు ఎవరికైతే ఎక్కువ విశిష్టత వున్నదో వారి మెడలోనే స్వయంవరంలో వరమాల పడుతుంది. ఎవరైతే దక్షతను ప్రదర్శిస్తారో మరియు ఇతరులను

ప్రభావవంతము చేసే యోగ్యత కలిగివుంటారో వారే ఎన్నికలలో గెలుస్తారు. బలమైన మణికట్టు కలవాని చేతిలో ఆయుధము నైపుణ్యముతో వాడబడి గెలుచుటకు కారణమౌతుంది. బలహీనులైనవారు ఓడిపోవుటతప్ప దేనిని సాధించుటలో సఫలమవ్వరు.

భీష్ముడు ఉత్తరాయణంలోకి సూర్యుడొచ్చేవరకు తన వైపు రావద్దని మృత్యువును బెదిరించాడు. సావిత్రి -యముడిని, ఆయన వాహనమైన ధున్నపోతు తోకను పట్టుకుని ఆపివేసింది. మరియు సత్యవంతుని ప్రాణములు తిరిగిచ్చేవరకు నిలదీసినది. అర్జునుడు పదుపైన బాణమును వేసి పాతాళగంగయొక్క ధారను పైకితీసుకొచ్చి భీష్ముని దాహం తీర్చాడు. రాణా-సాంగా శరీరములో ఎనభై లోతైన గాయములు తగిలాయి. అయినప్పటికి బాధను పట్టించుకోకుండా చివరి శ్వాస ఉన్నంతవరకు యుద్ధంలో పోరాడుతూనేవున్నారు. పెద్దపనులు గొప్ప వ్యక్తిత్వముగలవారి వల్లనే జరుగుతాయి. పెద్ద బరువులు ఎత్తడానికి ఏనుగు వంటి శక్తి గలవారు పనికొస్తారు. గొఱ్ఱెలు మరియు గాడిదలు ఎంత ఊహించుకున్నా, ఎంత గొప్పలు చెప్పుకున్నా అలాంటి పనులు చేయలేవు.

ప్రతిభ ఎటువైపు తిరిగితే అటువైపు బుల్‌డోజర్ వలే మైదానమును సాఫీగా చేసేస్తుంది. యూరప్‌లోని విశ్వవిజయము సాధించిన ప్రఖ్యాతి చెందిన వస్తాదు, సైండో కిశోరావస్థవరకు



అనేకమైన రోగములతో బాధపడ్డాడు. బలహీనమైన శరీరంతో తిరిగేవాడు. కానీ ఎప్పుడైతే అతను సమర్ధ మార్గదర్శకుని వల్ల ఆరోగ్యము మీద క్రొత్తదృష్టి మరల్చి దానిని అభివృద్ధి చేయుట మొదలెట్టాడో దానివలన అతి కొద్ది సమయంలో ప్రపంచస్థాయి వస్తాదుగా మారగలిగాడు. మొదట అతను సాధారణ స్థితిలో అధ్యాపకుడిగా జీవన యాత్ర చేసే బలహీన శరీరంగల వ్యక్తి. అతను మనోబలముతో క్రొత్తక్రొత్త మార్గములను, మెలకువలను నేర్చుకొని ఆరోగ్యమును తిరిగి సంపాదించుకొనుటయేకాక, ఎంత బలముగా తయారయ్యాడంటే హింద్‌కేసరీ అనే బిరుదును సంపాదించుకున్నాడు.

ఇంగ్లాండ్‌లోని ఒక వనిత క్యాన్సర్‌తో బాధపడుతున్నది. ఆఱునెలలకంటే ఎక్కువ బ్రతకడం కష్టమని వైద్యులు చెప్పేశారు. ఏ యంత్రంతో అయితే ఆవిడికి వైద్యము చేయగలరో అది కోట్ల రూపాయల విలువ చేస్తుంది. దానిని తమ దగ్గర వుంచుకోగల్గిన సామర్థ్యము ఏ వైద్యునకూ లేదు. రోగగ్రస్థమైన మహిళ క్రొత్త ఆలోచనలను చేసింది. ఆఱునెలలో చనిపోవలసినదే అని తెలిసినప్పుడు తనలా బాదపడుతున్న ఇతర రోగుల ప్రాణాలను ఎందుకు రక్షించకూడదు అని ఆలోచించినది. ఆవిడ టెలివిజన్‌లో ఒక ప్రకటనిచ్చింది. ఎవరైనా మూడు కోట్ల రూపాయలను ఉదార మనస్సుతో దానము చేయగల్గితే ఆ యంత్రం ద్వారా తనలాంటి ఎంతోమంది నిరాశాజీవులకు జీవనదానము చేయవచ్చు. డబ్బుల

వర్షము కురిసింది. దానితో ఒకటికాదు, మూడు యంత్రములను కొన్నారు, అంతేకాక క్యాన్సర్‌కు అన్ని వసతులతో కూడిన ఒక వైద్యాలయమును కూడా కట్టారు. ఆమె ఈ పనులలో ఎంత మునిగిపోయిందంటే ఆ ఆనందంలో తను చనిపోబోతున్నది అన్న విషయమే గుర్తులేదు. పని పూర్తయ్యాక ఆమెను పరిశీలించి చూస్తే ఆమెలో క్యాన్సర్‌కు సంబంధించిన చిహ్నంకూడా లేదు.

వైద్యాలయములో మంచంమీద పడుకుని వాల్టేయర్ గొప్ప గ్రంథములను రచించాడు. కాళిదాసు మరియు వరదరాజుల మేధాశక్తి వారు గొప్పవారు కాక ముందు ఎంత హాస్యాస్పదమైనవో అందరికి తెలుసు. కానీ వారు క్రొత్త ఉత్సాహముతో క్రొత్తపద్ధతిలో చదువుకోవడం మొదలెట్టారు. దానితొ గొప్ప పండితుల జాబితాలో చేరగలిగారు. వ్యక్తియొక్క అంతఃచేతనను ప్రతిభ అనికూడా అంటారు. ఇది ఎంత బలమైనదంటే అనేకరకములైన అభావములు (లేమి) మరియు వ్యవధానములను దాటుకొని అది ఉన్నతియొక్క ఉచ్చశిఖరములకు చేరుకొనుటలో సమర్థవంతమవుతుంది. ప్రతిభ వ్యక్తి యొక్క, మనస్వితగా, ఓజస్వితగా, తేజస్వితగా బహిరంగంగా ప్రకటీకృతమయ్యే సంపద. నిదురించుచున్న శక్తిని మేలుకొల్పినపుడు వ్యక్తి తనను తాను మలుచుకున్నప్పుడు అసంభవాలను సంభవాలుగాచేయవచ్చు. ఇది ఆధ్యాత్మిక విజ్ఞానములోని ఒక సునిశ్చితమైన సిద్ధాంతము మరియు చెరపలేని సత్యము.



## 5. ముందుకు నడవండి - లక్ష్యము చేరుకోండి

విద్యుత్ శక్తి యొక్క శక్తిసామర్థ్యములు అందరికి తెలిసినవే. చిన్న పెద్ద అనేకరకములైన యంత్రములు - ఉపకరణములు, ఈ శక్తితోనే నడుస్తాయి మరియు మహత్వపూర్ణమైన లాభాలను పొందుతారు. మానవశరీరంలో కూడా జీవనచర్యను నడిపించుటకు జీవవిద్యుత్తు పనిచేస్తుంది. మోహముపై మెఱుపు, స్ఫూర్తి మరియు పురుషార్థము దీని అనుదానములే. మనస్సులో శౌర్యము-పరాక్రమములు, సాహసము-విశ్వాసము మొదలగువాటి రూపములలో దీని అనుపాతము సంతోషజనకంగా వుంటే దానిని ప్రతిభ అంటారు. అది లోపల దాగివున్న సామర్థ్యమును జాగృతము చేస్తుంది. కష్టములను ఎదుర్కొనుటకు మరియు వాటిని ఓడించుటకుకూడా ఈ శక్తే ఉపయోగపడుతుంది. మహత్వపూర్ణమైన సృజన-ప్రయోజనములను గూర్చిన ఊహలను దాటి ప్రణాళిక వరకు మరియు ప్రణాళికను కార్యాన్వితము చేసి సాఫల్యమును సాధించుటకు కావలసిన సునిశ్చితమైన శక్తికూడా ఈ ప్రతిభదే. దీనినే ఆధ్యాత్మికభాషలో ప్రాణాగ్ని మరియు తేజస్వి మానసికత అంటారు. దీని కొరకు ఉపాసనాక్షేత్రంలో ప్రాణాయామమువంటి ప్రయత్నములు చేస్తారు. తపశ్చర్యలో తితీక్ష అలవరచుకొని తపస్సు చేయుటకు కావలసిన సాధన-సువిధలు ఈ అంతఃశక్తి సహాయముతోనే లభిస్తాయి. శాపము, వరదానములు అసాధారణ

స్థాయికి చెందిన చమత్కారములు చూపించుట ప్రాణాగ్నిని జ్వలింపచేయడంవల్ల ఉత్పన్నమయ్యే రిద్ధులు-సిద్ధులు.

శరీరబలము, ధనబలము, బుద్ధిబలము మొదలగునవి ఎంతోమందిలో కనిపిస్తాయి. కానీ ప్రతిభాధనము కలవారు అతి కష్టమ్మీద ఎక్కడో వెతికితేకానీ దొరకరు. దైత్యులు దుష్ప్రయోజనములకొరకు, దేవతలు సత్ప్రయోజనములకొరకు ఈ ప్రతిభాశక్తినే వుపయోగిస్తారు. సముద్రమంథనంవంటి మహాపరాక్రమంతో కూడిన పనులు ఈ సామర్థ్యముపైనే ఆధారపడి ఉంటాయి.

సత్సంగమువలన అభివృద్ధి జరుగుతుంది. మరియు కుసంగంవలన పతనములకు భూమిక ఏర్పడుతుంది. ఇది సమర్థవంతుని ప్రతిభ యొక్క మంచి-చెడుల స్థాయిమార్పిడి తప్ప ఇంకేమీ కాదు. మానవీయ విద్యుత్తుయొక్క అనేకమైన చమత్కారములను పరిశీలిస్తే ప్రతిభతో గుర్తింపబడే ప్రాణవిద్యుత్తే తన క్షేత్రంలో తన పద్ధతిలో తన పనిని చేస్తుందని చెప్పవచ్చు. ఎవరిలో ఇది లోపిస్తే వారిని పిఱికివారనీ, కర్మశూన్యులనీ, భయగ్రస్థులనీ, సోమరులనీ అంటారు. ఇవి ఆత్మహీనత మరియు గ్రంథుల లోపంవలన ఏర్పడతాయి. సంశయము, ఇతరులపైన ఆధారపడుట, మనస్సులోనే కుమిలిపోవుట వంటివి ముందు ఈ విశిష్టతలు లేకపోవడంవల్లనే జరుగుతాయి.

ఆలోచించుట, కోరుకొనుట, ఊహించుకొనుట మరియు కోరికలు-ఆకాంక్షల ముసుగులు వేసుకొని చాలా మంది పెద్దపెద్ద



అభిలాషలు కలిగి ఉంటారు. కానీ వాటిని పొందుటకు కావలసిన తత్పరత, దృఢత్వము, సంకల్పము నిరంతరము చేయవలసిన ప్రయత్నాలు చేయరు. దీని ఫలితముగా వాళ్ళు మనస్సును చంపుకుని కూర్చుంటారు మరియు అసఫలత వలన కలిగిన నిరాశను చేజిక్కించుకుని వారు అదృష్టమును తిట్టుకుంటూ ఉండటంతప్ప ఇంక ఏమీ చేయలేరు.

పరసువేది తాకిన ఇనుము బంగారం అవుతుంది. ఈ ప్రతిపాదన తప్పో, ఒప్పో తెలీదు. ప్రతిభ తోడైనప్పుడు సామాన్య పరిస్థితులలో జన్మించి పెరిగిన మనిషి పరిస్థితులవలన ఏర్పడిన అడ్డంకులను తొలగించుకుంటూ ప్రగతిమార్గంలో అగ్రగామిగా మరియు ఊర్ధ్వగామిగా అవుతాడు అన్న విషయములో సందేహించుటకు అవకాశమే లేదు. పువ్వులు వికసించినప్పుడు తేనెటీగలు, సీతాకోకచిలుకలు ఎక్కడినుండో వచ్చి వాని అందాన్ని మరింత పెంచుతాయి. వాటి యశస్సును కీర్తించుటకు వెనుకాడవు. దేవతలు పూలను వర్షింపజేస్తారు. మరియు ఈశ్వరుడు వారికి సహాయము చేయుటలో వెనుకాడడు.

వ్యక్తిత్వ పరిష్కారమే ప్రతిభాపరిష్కారము. ఖనిజాలున్న గనులు ఎక్కడుంటే అక్కడ ఆ క్షేత్రంలో వున్న మట్టి క్రింద ఉన్న ధాతుకణాలు గనులున్న దిశవైపు కదులుతాయి. గని యొక్క అయస్కాంత శక్తికి ఆకర్షించబడి ఇంతకు ముందు వెలికి తీయబడ్డ ఖనిజాల భారము, కళేబరము, గౌరవమును పెంచుతాయి. మంచి వ్యక్తిత్వము గలవారు అనేకమంది స్నేహము, సహకారము,

పరామర్శ మరియు ఉపయోగకరమైన సాన్నిధ్యాన్ని పొందుతారు. ఇదే నిజమైన పురుషార్థము. అనేక వసతులు- సాధనలు ఇతరుల ప్రోత్సాహము వల్ల లభించవచ్చు. కానీ ప్రతిభాపరిష్కారము కొరకు తన సంకల్పము, సమయము మరియు పురుషార్థమే పనికొస్తాయి. పురుషార్థంలో ఎటువంటి లోపము ఉండకూడదు అనే వుద్దేశ్యముతోనే గీతాచార్యుడు అనేక ప్రసంగములలో ఆలోచనాపరులను ప్రోత్సహించాడు. మనిషి స్వయంగా తనకు తానే శత్రువు మరియు తనకి తానే మిత్రుడు అని ఒకచోట చెప్పాడు. అందువలన తమనుతాము ఉద్ధరించుకోవాలికానీ దిగజారకూడదు.

నీటిలో బుడగలు వాటి లోపల గాలి నింపడంవలన ఎగురుతూ గెంతుతూ వుంటాయి; కానీ గాలి బయటకు పోయినప్పుడు అది నేలరాలటానికిఎక్కువ సమయము పట్టదు. లోపల జీవనీ శక్తి ఉన్నప్పుడు బయట తొడుగు చాలా ఆకర్షణీయంగా లేక ఆకర్షణ లేకుండాగానీ ఉండవచ్చు, కానీ లోపల ఏమీ లేకుంటే డమ-డమల గర్జనలు తప్ప మరి ఏ ఇతర ప్రయోజనము ఉండదు. స్థూల దృష్టికి పృథ్వీ స్థిరంగా వున్నట్లు కనిపిస్తుంది. కానీ దాని గతిశీలత మరియు గురుత్వాకర్షణశక్తి ఎంత ఎక్కువంటే ఒక సంవత్సరంలో సూర్యునియొక్క పొడవాటి కక్ష్యలో పరిభ్రమణము పూర్తిచేస్తుంది. అంతేగాక ప్రతిదినము తన చుట్టూ తాను బొంగరంవలె తిరుగుతువుంటుంది. రోజూ ఒకే దినచర్యను అనేక వ్యక్తులు పాటించినా లోపల వున్న చేతన ఎంత వేగంగా



పుంజుకుంటుందంటే సామాన్య పరిస్థితులలోనేవుంటూ ఉన్నతియొక్క అత్యున్నత శిఖరము చేరుకుంటారు. సామర్థ్యము లోపలినుండే పెరుగుతూ చమత్కారములను చూపిస్తుంది. దానిని తీర్చిదిద్దేందుకు, వెలికి తీసేందుకు శ్రద్ధను చూపితే వ్యక్తిత్వము యొక్క ప్రఖరత ఎంత సూటిగా వెళుతుందంటే ఎక్కడికి గురిపెట్టినా లక్ష్యమునకు క్షణంలో చేరుకుంటుంది.

ఆరోజుల్లో జర్మనీ మొత్తము శక్తిని కూడదీసుకుని మిత్రరాష్ట్రములతో పోరాడింది. ఇంగ్లాండ్‌తోపాటు రష్యా మరియు అమెరికా కూడా వున్నాయి. వారు జర్మనీ ధాటికి తట్టుకోలేక నష్ట పరిహారము ఇచ్చి తప్పించుకుందాము అని అనుకున్నారు. ఈ విషయము ఇంగ్లాండ్ ప్రధానమంత్రి చర్చిల్ ముందుంచబడినది. అప్పుడు ఆయన 'మీరు ఎలా కావాలంటే ఆలా నిర్ణయము తీసుకోవచ్చు. కానీ ఇంగ్లాండ్‌మాత్రం ఓడిపోయే ప్రసక్తే లేదు. తన యుద్ధము తనే చేసి గెలిచి చూపిస్తుంది' అన్నాడు. ఆయన ప్రచండ ఆత్మవిశ్వాసమును చూసి తోటివారిద్దరూ వెనక్కి పాఱిపోకుండా నిలబడి పోరాటానికి సిద్ధమయ్యారు. డార్విన్ సిద్ధాంత ప్రకారము కోతినుండి వచ్చిన మానవుడు ఈ కారణంగా సృష్టికి మకుటాయమానమైన మణిగా మారాడు. పృథ్వీ, సముద్రము పైనే కాదు, అంతరిక్షంలో కూడా తన ఆధిపత్యమును స్థాపిస్తున్నాడు. ఒకప్పటి సమర్థవంతమైన దేవత అయిన చంద్రుని కూడ తన కాళ్ళ వద్ద కూర్చోవడానికి వివశుడిని చేశాడు.

కట్టెలకు ఏదైనా బరువైన ఊయిని కట్టినప్పుడు మాత్రమే

నీటిలో మునిగి వుంటాయి. ఆ బరువుని తీసివేసిన మరుక్షణము అలలతోపాటు తేలుతాయి. మరియు సుడిగుండాలని దాటి చాకచక్యంగా ముందుకెళతాయి. బూడిదతో కప్పబడి ఉన్న అగ్ని కనిపించదు. విలువలేనిదిగా కనిపిస్తుంది. కానీ బూడిద తొలగిపోగానే తన జాజ్వల్యమాన శక్తిని ప్రకటీకరిస్తుంది. నిజానికి మనిషి తనను సృష్టించిన సృష్టికర్త వలె సామర్థ్యము కలవాడే.

కట్టెల రాపిడితో నిప్పును పుట్టించగల మనిషి తనలో వున్న శక్తివంతమైన ప్రతిభను స్వశక్తితో ఇతరుల సహాయం లేకుండా ప్రకటీకరింపజేసుకోగలడు. ప్రబల ఇచ్ఛాశక్తి మరియు ఉత్కంఠ ఉంటే చాలు. ఇవి తగ్గకపోతే అది దేవతలకంటె మరియు రాక్షసులకంటె తక్కువకాని తనలో ఉన్న సామర్థ్యమును ప్రకటీకరించుకోగలడు. కానీ ఎప్పుడైతే నీచమైన పనులుచేయడం మొదలెడతాడో అప్పుడు భూత-పిశాచములకంటె భయంకరంగా వుంటాడు. అలాకాక ఎప్పుడైతే తన శ్రేష్టతను పెంచుకుని, పనిచేయుటలో మునిగిపోతాడో అప్పుడు దేవతలుగూడా అతనికి నమస్కరిస్తారు. మానవ శరీరంలో భగవంతుడు మఱలమఱల అవతారము ధరిస్తాడు. మనిషినుండి వచ్చే అభ్యర్థనకోసం దేవతలు ఎదురుచూస్తుంటారు. అలాంటిది దొరికిన వెంటనే వారిని వరదానములతో ముంచెత్తుతారు. స్వర్గంలోని దేవతలు రిద్ధులు, సిద్ధుల రూపంలో అతనిముందు వెనుక తిరుగుతుంటాయి. ఆజ్ఞను పాటిస్తాయి. ఈ భూలోకము సౌరమండలంలోని సమస్త గ్రహ-ఉపగ్రహముల కంటే అధికమైన జీవములతో నిండి



సుసంపన్నము మరియు శోభాయమానంగా వుంటుందని అంటారు. ఆదికాలంలోని ఊయిరప్పలతో నిండిన పృథ్వి ఈనాడున్నంత అందంగా అలంకరింపబడిన స్థితికి రావటానికి కేవలము మానవుని పురుషార్థముయొక్క గొప్పదనమే అనేది మర్చిపోకూడదు. అతను అనేక జీవులను-జంతువులను, పశువులను-పక్షులను పెంచుతూవుండటమేకాక వాటికి పాలనకర్త, ఆశ్రయాన్నిచ్చిన దాత అయ్యాడు. మనిషి ప్రసుప్త సామర్థ్యమును జాగృతము చేసి, పైకి తెచ్చుటకు సరైన పద్ధతిలో నడుము బిగించి కృషిచేస్తే, అతని యశస్సును-కీర్తిని గానము చేయుటకు లేఖినీ మరియు వాక్కుకూడా ఓడిపోయేంతటి ప్రతిభాధనాన్ని సాధించవచ్చు.

మనిషి ప్రభావశాలియే, కానీ దానితోపాటు వాతావరణంనుండి కూడా ప్రభావాన్ని గ్రహిస్తాడు. దుర్గంధములను పీల్చుటవలన తల తిరుగుతున్నట్లు వుంటుంది. మరియు సుగంధ ప్రభావం శాంతిని, ప్రసన్నతను మరియు ప్రఫుల్లతను చేకూరుస్తుంది. చెడ్డవారి మధ్య సమయాన్ని గడిపేవాడు, వాటిపై ఇష్టాన్ని కలిగియుండేవాడు క్రమంగా పతనము మరియు పరాభవముల గోతిలో పడతాడు. అలాగే మనీషుల, చరిత్రవంతుల, సత్సాహసము కలవారి సంపర్కము వలన దాని ప్రభావము సహజంగానే అతనిని లాగుతూవుంటుంది మరియు వ్యక్తి దిగజారుట, పైకి లేచుటలలో అసాధారణమైన సహాయాన్ని అందిస్తుంది. ఈరోజులలో వ్యక్తి మరియు సమాజంలో హీనత్వము మరియు నికృష్టతే ఎక్కువగా

వున్నది. ఎక్కడ ఇలాంటి వాతావరణము వ్యాపించి వున్నదో దానినుండి వీలైనంతమటుకు తప్పించుకొని తిరగవలెను. మరియు సహకారమును అందించకుండటమే వుచితము.

సజ్జనుల సాన్నిధ్యము దొరకడము కష్టమైనదే. మరియు సత్ప్రవృత్తుల సామర్థ్యంకూడా అక్కడక్కడమాత్రం కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితులలో మన పూర్వీకు లనుసరించిన సదాశయముల గూర్చి పుస్తకములలో వర్ణించిన ప్రసంగాలవలన, సమాచారములవలన తెలుసుకొనవచ్చు. ఆ సంస్మరణలు ఆచరించగలిగితే దేవలోకంలోని నందనవనంలో విహరిస్తున్నామా అన్నట్లుగా అనుభవము కలుగుతుంది. ఈ విషయంలో స్వాధ్యాయము మరియు సత్సంగముల సహాయమును తీసుకొనవచ్చు. చరిత్రలో స్వర్ణాక్షరములతో పేర్లు వ్రాయగలిగిన మరియు మానవుని స్థాయిని భువనభువనాంతరములవరకు వ్యాపింపజేసుకున్నవారిని ఇతిహాసంలో దర్శించవచ్చు.

ఆత్మవిశ్వాసం చాలా గొప్పది. అది త్రాడును పాముగా మరియు పామును త్రాడుగాను మార్చగల శక్తి గలది. ఇతరుల సహయోగము లభించకపోయినామన ఆలోచనలు, చరిత్ర, వ్యవహారములను మనస్సుకు నచ్చినట్లు మార్చుకుంటూ తీర్చిదిద్దుకుంటూ పోవచ్చు. సంకల్పశక్తిని వివరిస్తూ అది బండఱాళ్ళను బ్రద్దలుగొట్టగలదు, గట్టిగా ఉన్నదాన్ని మృదువుగా మార్చగలదు, అంతేకాక కస్తూరీమృగము వలె ఏది పొందాలని ఆశిస్తూ అటు-ఇటు వెతుక్కుంటున్నామో ఆ సాధనాలను,



పరిస్థితులను లాక్కుని వస్తుందని చెబుతారు.

మనిషి దిగజారినప్పుడు దుష్కర్మలుగూడా చేస్తాడు. ఆత్మహత్య చేసుకునే ఆలోచనలకూడా చేస్తాడు. అందువల్ల అభివృద్ధి చెందాలి అనే కోరిక కలగితే అభీష్ట అభ్యుదయము ఎందుకు పొందలేడు? ఇతరులపై విశ్వాసమునుంచి వారిని మిత్రులుగాను, సహయోగులుగానూ చేసుకోవచ్చు. శ్రద్ధ వుంటే ఱాయిలో కూడా దేవతను దర్శించవచ్చు. తనలోని శ్రేష్టతను అర్థము చేసుకుని తీర్చిదిద్దుకోగలిగితే వ్యక్తి సమున్నత స్థితికి చేరకుండుటకు సంపూర్ణ సఫలతను పొందకుండుటకు కారణమే లేదు.

జాగరూకతతో ఆత్మనిరీక్షణను చేసినప్పుడు లోలోపల దాగివున్న తప్పులన్నీ దృష్టిగోచరమవుతాయి; మామూలుగా ఇతరులలోని తప్పులను భూతద్దములతో చూసే అలవాటు వుంటుంది. అటులనే మనలో దాగివున్న దోషములు-దుర్గుణములను సూక్ష్మదృష్టితో వెతికి వాటిని ఓడించుటకు సాహసమును చూపించినచో తప్పక వాటినుండి ముక్తికలిగి సుసంస్కారవంతులమవుతాము. అలానే ఇతరులలోకంటే మనలోని విశిష్టతలను తెలుసుకొని వాటిని మరింత జాగ్రత్తగా కాపాడుకుంటూ పెంపొందించుకునే ఉత్సాహముంటే. దానివలన వ్యక్తిత్వము ఎక్కువ ప్రగతిని, ప్రతిభను సాధిస్తుంది.

ఈ సమయంలో నవీనసృజన కొరకు ప్రచండమైన వాతావరణము ఏర్పడుచున్నది. ఉజ్జ్వల భవిష్యత్తును నిర్మించుటపైనే సృష్టికర్తయొక్క మొత్తము ధ్యానము మరియు

ప్రయాస కేంద్రీకరింపబడి వున్నది. ఈ సమయంలో మనంకూడా ఆయన పనిలో భాగస్వాములమైతే సత్పరిణామములు ఏర్పడుటే కాక, ప్రతిభాపరిష్కారము యొక్క లాభము నగదు, ధనము వలె పొందడము సునిశ్చితముగా అనుభవంలోకి తెచ్చుకొనగలము.

సృజనశిల్పుల సముదాయమును ముందుకు తీసుకెళ్ళుటకు ఏర్పరచివున్న కేంద్రీయశక్తి మనకు మరియు ఇతరులకు అనేకరకములైన ఉదాహరణలతో కలిగించే విశ్వాసమేమనగా ఇది పరశువేదిని తాకే సమయము, కల్పవృక్షము క్రింద కూర్చుండే అవకాశము. ఈ ప్రభాత సమయంలో జాగరూకతతోవున్న యెడల మనందరికి ప్రసన్నత, ప్రఫుల్లత మరియు సాఫల్యము యొక్క లాభములు పూర్తిగా లభిస్తాయి. అంతేకాక పరిష్కృత ప్రతిభాయుక్తమైన వ్యక్తిత్వము కూడా సంపూర్ణంగా లభిస్తుంది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

మహాపూర్ణాహుతి పుస్తకమాల - 8

**ప్రతిభావంతులకు మహాకాలుని పిలుపు**

మూల్యము :

అక్షరకూర్పు : కు. శ్రీదేవి శ్రీమతి రాజ్యలక్ష్మి
డిజైన్ : వై.హెచ్.ఎస్.ప్రసాద్, హైదరాబాద్.

ప్రకాశకులు : హిందీ: యుగనిర్మాణయోజన,
గాయత్రీ తపోభూమి, మథుర

ముద్రణ మరియు ప్రతులకు :

**గాయత్రి చేతనా కేంద్రము**
అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్, హైదరాబాద్-500018.
ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888
E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

## క్రాంతిధర్మీ సాహిత్యము యొక్క 20 పుస్తకములు

1.ఇరవైఒకటవ శతాబ్ది - ఉజ్వలభవిష్యత్ - 1 (ఇక్కీస్వీసదీ బనామ్ ఉజ్వలభవిష్య్-భాగ్1)
2.ఇరవైఒకటవ శతాబ్ది - ఉజ్వలభవిష్యత్ - 2 (ఇక్కీస్వీసదీ బనామ్ ఉజ్వలభవిష్య్-భాగ్2)
3.యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 1 (యుగ్ కీ మాంగ్ ప్రతిభాపరిష్కార్-భాగ్1)
4.యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 2 (యుగ్ కీ మాంగ్ ప్రతిభాపరిష్కార్-భాగ్2)
5.సత్యయుగ పునరాగమనము (సత్‌యుగ్ కీ వాపసీ)
6.పరివర్తన యొక్క గొప్ప క్షణములు (పరివర్తన్ కే మహాన్ క్షణ్)
7.జీవన సాధన యొక్క స్వర్ణిమసూత్రములు (జీవన్ సాధనాకే స్వర్ణిమ్ సూత్ర్)
8. ప్రతిభల కొరకు మహాకాలుని ఆహ్వానము (మహాకాల్ కా ప్రతిభావోం కా ఆమంత్రణ్)
9. ప్రజ్ఞావతారము యొక్క విస్తారప్రక్రియ (ప్రజ్ఞావతార్ కీ విస్తార్ ప్రక్రియా)
10. నవసృజనము కొరకు మహాకాలుని ఏర్పాట్లు (నవసృజన్ కే నిమిత్త్ మహాకాల్ కీ తైయారీ)
11. నేటి సమస్యలకు రేపటి సమాధానము (సమస్యాయే ఆజ్ కీ సమాధాన్ కల్ కీ)
12. మనఃస్థితి మారితే పరిస్థితులు మారతాయి (మనఃస్థితి బదలే తో పరిస్థితి బదలే)
13. ప్రఖరప్రజ్ఞ - స్రష్ట యొక్క పరమ అనుగ్రహము (స్రష్టా కా పరమ్ ప్రసాద్ ప్రఖర్ ప్రజ్ఞా)
14. ఆద్యశక్తి గాయత్రి యొక్క సమర్థసాధన (ఆద్యశక్తి గాయత్రీ కీ సమర్థ్ సాధనా)
15. శిక్షే కాదు విద్య కూడా (శిక్షా హీ నహీ విద్యా భీ)
16. సంజీవనీ విద్య యొక్క విస్తరణ (సంజీవనీ విద్యా కా విస్తార్)
17. భావసంవేదనల గంగోత్రి (భావ్ సంవేదనాఓం కీ గంగోత్రీ)
18. మహిళా జాగృతి అభియానము (మహిలా జాగృతి అభియాన్)
19. జీవన దేవతా సాధన - ఆరాధన (జీవన్ దేవతా కీ సాధనా - ఆరాధనా)
20. సమయదానమే యుగధర్మము (సమయదాన్ హీ యుగ్ ధర్మ్)